www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

స్తంభాద్రి భద్రాద్రి

మంగళవారం | 09 | డిసెంబర్ | 2025 పేజీలు : 8



# నిజాయితీపరులు, అభివృద్ధి కాముకులకు పట్టం కట్టండి





**-సిపిఐ, సిపిఐ బలపర్చిన అభ్యర్థులను గెలిపించండి : కూనంనేని**

**-చింతకాని, బోనకల్, మధిర, కొణిజర్ల, రఘునాథపాలెం మండలాల్లో విస్తృత పర్యటన**









**ప్రజాపక్షం/ఖమ్మం :** గ్రామ పంచాయతీ ఎన్నికల్లో నిజాయితీపరులైన అభ్యర్థులను, గ్రామాభివృద్ధే లక్ష్యంగా పనిచేసే వారిని గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఈనెల 11న జరిగే పంచాయతీ ఎన్నికల్లో సిపిఐ, సిపిఐ బలపర్చిన అభ్యర్థులకు పట్టం కట్టాలని ఆయన కోరారు. సోమవారం మొదటి విడత పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న

మిగతా 2లో..

# పరిశ్రమలు ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడంలో కీలక పాత్ర



**- పరిశ్రమలను ప్రోత్సహించేందుకు కార్యాచరణ**

**-గ్రానైట్ రంగం నిలబడితే వేల కుటుంబాలకు జీవనోపాధి**

**-గ్రానైట్ యూనిట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రానైట్ రంగం నిలబడితే వేల కుటుంబాలకు జీవనోపాధి లభిస్తుందని, త్వరలో పరిశ్రమ ప్రతినిధులతో విస్తృత సమావేశం ఏర్పాటు చేసి సమస్యల పరిష్కారం కోసం కార్యాచరణ చేపడతామని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. సోమవారం ఖమ్మం నగరం ఖానాపురంలోని ఇండస్ట్రీయల్ కాలనీ గ్రానైట్ పారిశ్రామిక ప్రాంతాన్ని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సందర్శించి పరిశ్రమల స్థితిగతులను, పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పలు గ్రానైట్ యూనిట్లలలో జరుగుతున్న ఉత్పత్తి, ప్రాసెసింగ్ పనులకు సంబంధించి వివరాలను

మిగతా 2లో..

# రెవెన్యూశాఖలో అవినీతి లీల






**- లంచం ఇస్తేనే ఫైలు కదిలేది**

**- సామాన్యులకు అన్యాయం జరుగుతున్న వైనం**

**- తమ విధులను సక్రమంగా నిర్వహించటం లేదని ఆరోపణలు**

**- అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని ప్రజల డిమాండ్**

**ప్రజాపక్షం/మధిర :** మధిర రెవెన్యూశాఖలో అధికారుల అవినీతి రాజ్యమేలుతోంది. ఏ పని చేయాలన్నా లంచం ఇస్తేనే చేస్తామని, లేనిపక్షంలో ఆ పనులను ఏ మాత్రం పట్టించుకోవటం లేదని ప్రజల నుండి పెద్ద ఎత్తున విమర్శలు విన్పిస్తున్నాయి. ప్రధానంగా మున్సిపాల్టీ, రెవెన్యూశాఖలో కొంతమంది అధికారుల అవినీతి బాగోతం వలన సామాన్యులకు న్యాయం జరగటం లేదని, వివిధ సమస్యలు పరిష్కరించాలని అధికారులు చుట్టూ ప్రదక్షణలు చేసినా నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారని సామాన్య ప్రజలు వాపోతున్నారు. బాధ్యత గల అధికారులు తమ విధులను సక్రమంగా నిర్వహించకపోవటంతో అనేకమంది సామాన్యులకు న్యాయం జరగక రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. రెవెన్యూశాఖలో కొంత మంది అధికారులు లంచం తీసుకుని

మిగతా 2లో..

# నిజాయితీపరులు, అభివృద్ధి కాముకులకు పట్టం కట్టండి







(మొదటిపేజీ తరువాయి)




పలు మండలాల్లోని గ్రామ పంచాయతీల్లో సిపిఐ బలపర్చిన అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో జరిగిన సభల్లో కూనంనేని మాట్లాడుతూ దేశాభివృద్ధికి పల్లె సీమలే పట్టుకొమ్మలని అటువంటి పల్లెల్లో అభివృద్ధి పనులను నిజాయితీతో చేసే వారిని గెలిపించాలన్నారు. సిపిఐ, సిపిఐ బలపర్చిన అభ్యర్థులు గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేసేవారని ఆయన తెలిపారు. ప్రభుత్వం నుంచి కోట్లాడి నిధులు సాధించి ఆ నిధులను సద్వినియోగం చేసే వారిని గెలిపించాలన్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ నిజాయితీపరులైన అభ్యర్థులను పంచాయతీ ఎన్నికల్లో బలపరుస్తుందని వారిని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్లకు ఎరవేసి ప్రలోభాలకు గురిచేసే అవకాశం ఉందని అటువంటి ప్రలోభాలకు లొంగకుండా విజ్ఞతతో ఓటు వేయాలన్నారు. బస్వాపురంలో ఆవుల నర్సింహారావు, నేరడలో దూసరి నేతాజీ, కొండవనమాలలో కొనకంచి రామారావు, పెద్దమునగాలలో నీలాల కళావతి, చిన్నగోపతిలో తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, మల్లవరంలో మందడపు రాణి, బ్రాహ్మణపల్లిలో తార, కోదుమూరులో బోళ్ల ప్రమీల, తనికెళ్లలో గడల కళావతి, రఘునాథపాలెం మండలం వి.వెంకటాయపాలెంలో శాఖమూరి శ్రీనివాసరావు, పంగిడిలో పోలి జామ్లా ను గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. బరిలో నిలిచిన పంచాయతీ సర్పంచులు, వార్డు సభ్యుల గుర్తులను తెలియజేస్తూ పలు చోట్ల ఇంటింటి ప్రచార కార్యక్రమంలో కూనంనేని పాల్గొన్నారు.

**దూసరి నేతాజీని అత్యదిక మెజార్టీతో గెలిపించండి :**

దూసరి నేతాజీని అత్యదిక మెజార్టీతో గెలిపించాలని అమ్మ ఫౌండేషన్ ఛైర్మన్ మల్లు నందిని విజ్ఞప్తి చేశారు. సోమవారం నేరడ గ్రామంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తో కలిసి సర్పంచ్ అభ్యర్థి దూసరి నేతాజీ గెలుపును కాంక్షిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దూసరి నేతాజీని గెలిపిస్తే నేరడ పంచాయతీని అభివృద్ధి పదంలో నడిపిస్తామన్నారు. శాసన సభ్యునికి, మంత్రికి అనుబంధంగా ఉండే అభ్యర్థులను గెలిపించడం ద్వారా గ్రామాలు శీఘ్ర గతిన అభివృద్ధి చెందుతాయని ఆమె తెలిపారు. కూనంనేని వెంట సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు దొబ్బల సౌజన్య, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, కొండపర్తి గోవిందరావు, ఎస్‌కె జానిమియా, జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, దొండపాటి రమేష్, బెజవాడ రవి, సిహెచ్ సీతామహలక్ష్మి, తోట రామాంజనేయులు, పావులూరి మల్లికార్జున్, మేకల శ్రీనివాసరావు, ఏనుగు గాంధీ, యంగల ఆనందరావు, నాయకులు దూసరి గోపాలరావు, గాదె లక్ష్మి నారాయణ, గడల భాస్కర్, ఊట్ల కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

# రెవెన్యూశాఖలో అవినీతి లీల

(మొదటిపేజీ తరువాయి)



LA - 3rd Railway line 20

Government of Telangana
Office of the Land Acquisition Officer &
Revenue Divisional Officer, Khammam

Date: 28.11.2024

From
Sri G.Narasimha Rao,
Competent Authority (LA) &
Revenue Divisional Officer,
Khammam

To
The Tahsildar,
Madhira Mandal

Sir,

Therefore, I enclose herewith the copy of the above mentioned representation and request to conduct discreet enquiry into the matter and submit a detailed report along with the documentary evidences / location sketch, etc., on the representation filed by the applicant, for taking further course of action.

Yours faithfully,

Land Acquisition Officer &
Revenue Divisional Officer,
Khammam

అక్రమార్కులకు అండగా నిలబడి సామాన్యులకు అన్యాయం చేస్తుంటే ఉన్నతాధికారులు మాత్రం అటువైపు కన్నెత్తి కూడా చూడకపోవడం గమనార్హం. సాక్షాత్తూ డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గ కేంద్రమైన మధిరలో ఇటీవల కాలంలో పలు అవినీతి అక్రమాలు వెలుగులోకి వస్తుండటంతో ప్రజల్లో చర్చనీయాంశంగా మారింది. మధిర ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క డిప్యూటీ సిఎం, ఆర్థికశాఖ, విద్యుత్‌శాఖ మంత్రి హోదాలో రాష్ట్ర అభివృద్ధి, పేద ప్రజల సంక్షేమం కోసం ఇతర ప్రయోజనాల కోసం పాటుపడుతుంటే మధిరలో అధికారులు మాత్రం అవినీతికి పాల్పడుతూ సామాన్య ప్రజలకు అన్యాయం చేస్తుండటంతో అధికారులు వ్యవహరిస్తున్న తీరు పట్ల ప్రజలు మండిపడుతున్నారు. మధిర పట్టణంలోని ప్రధాన రైల్వే ట్రాక్ పక్కన ఉన్న రాయల్ లాడ్జి డాబాను రైల్వే మూడవ లైన్ నిర్మాణ పనుల్లో భాగంగా డాబాలోని కొంతభాగాన్ని రైల్వే అధికారులు తీసుకున్నారు. రాయల్ లాడ్జి భవనం శిథిలావస్థకు చేరి కూలే దశలో ఉండటంతో రైల్వే అధికారులు తీసుకున్న స్థలానికి సుమారు రూ.31లక్షలు, బిల్డింగ్ మొత్తానికి రూ.68లక్షలు కలిపి మొత్తం రూ.89లక్షలు నష్టపరిహారం అందించగా నలుగురు వాటాదారులుగా ఉన్న బిల్డింగ్‌లో నాల్గోవ వాటాదారునికి మొత్తం బిల్డింగ్‌కు ఇచ్చిన నష్టపరిహారం రూ.68లక్షల్లో సుమారు రూ.7లక్షలు ఇవాల్సి ఉండగా అప్పుడు సర్వేకు వచ్చిన రైల్వే, రెవెన్యూ, ఆర్‌అండ్‌బి అధికారులకు ముగ్గురు వాటాదారులు ఈ భవనం మాదేనని చెప్పిన మాటలను విని క్షేత్రస్థాయిలో సర్వే చేయకపోవడంతో ఇదే అదునుగా భావించిన ఇతర ముగ్గురు వాటాదారులు నాల్గోవ వాటాదారునికి న్యాయంగా రావాల్సిన నష్టపరిహారం రాకుండా మోసం చేసి కాజేశారు. ఈ విషయంపై నాల్గోవ వాటాదారుడి కుటుంబం గత సంవత్సరకాలంగా సంబంధిత అధికారులకు ఫిర్యాదులు, వినతిపత్రాలు అందించి వారి చుట్టూ తిరుగుతున్నా ఏ మాత్రం పట్టించుకోవటం లేదని బాధిత కుటుంబసభ్యులు వాపోతున్నారు. ఇదిలా ఉంటే నాల్గోవ వాటాదారుడి కుటుంబం తమకు నష్టపరిహారం అందించి న్యాయం చేయాలని అధికారులకు విన్నవించిన సమస్యకు సంబంధించిన రిపోర్ట్‌ను ఇంతవరకు పై అధికారులకు పంపించకపోవటం వెనుక మతలబు ఏమిటో అర్థం కావటం లేదని బాధిత కుటుంబ సభ్యులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఇతర వాటాదారులు ఇచ్చిన ఆమ్యామ్యాలకు కక్కుర్తిపడటం వలననే రిపోర్ట్‌ను పై అధికారులకు పంపించటం లేదనే ఆరోపణలు పెద్ద ఎత్తున్న విన్పిస్తున్నాయి. ఇప్పటికైనా డిప్యూటీ సిఎం, జిల్లా కలెక్టర్ స్పందించి దీనిపై సమగ్ర విచారణ జరిపించి అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకుని బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# పరిశ్రమలు ఆర్థిక వ్యవస్థను నిలబెట్టడంలో కీలక పాత్ర

(మొదటిపేజీ తరువాయి)

అడిగి తెలుసుకున్నారు. యూనిట్ నిర్వాహకులు, పారిశ్రామిక వేత్తలు, కార్మికులతో కలెక్టర్ సంభాషించారు. పరిశ్రమ ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఆరా తీశారు. విద్యుత్ ఛార్జీలు, ఎగుమతి సమస్యలు, మార్కెట్ డిమాండ్ తగ్గుదల, ముడి సామగ్రి రవాణా వ్యయాల పెరుగుదల వంటి పలు అంశాలపై కలెక్టర్ వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుతం గ్రానైట్ పరిశ్రమకు పునరుద్ధరణ మార్గాలు చూపించే దిశగా ప్రభుత్వం తరుపున అభివృద్ధికి ముందడుగు వేస్తున్నామన్నారు. గ్రానైట్ పరిశ్రమ జిల్లాలో వేలాది కుటుంబాల జీవనాధారమని పరిశ్రమల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత వరకు పరిష్కారమయ్యేందుకు ప్రయత్నిస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పారిశ్రామిక రంగాన్ని మరింత విస్తరించడానికి ప్రణాళికలు రూపొందిస్తుందన్నారు. పరిశ్రమలు ఆర్థిక వ్యవస్థను బలంగా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తాయన్నారు. గ్రానైట్ యజమాన్యం వాతావరణ కాలుష్య నివారణకు ఆదేశా



లను పాటిస్తూ ప్రజలకు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు చేపట్టాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ సీతారాం నాయక్, ఖమ్మం ఆర్డీవో జి. నర్సింహారావు, టిజిఐఐసి డిఈ స్మరత్‌చంద్ర, జెఈ శివకుమార్, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ బలపరిచిన అభ్యర్థులను గెలిపించండి



**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో తాటిపూడి, గొల్లపూడి గ్రామాల్లో బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు వైరా నియోజకవర్గ సిపిఎం కార్యదర్శి భూక్యా వీరభద్రంతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా తాటిపూడి గ్రామంలో బిఆర్ఎస్, సిపిఎం, తెలుగుదేశం మద్దతుతో పోటీ చేస్తున్న సర్పంచ్ అభ్యర్థి బట్టా భద్రయ్యను గెలిపించాలని ఆయన కోరారు. అదేవిధంగా గొల్లపూడి గ్రామంలో బిఆర్ఎస్, తెలుగుదేశం, బిజెపి, జనసేన బలపరిచిన ఉమ్మడి అభ్యర్థి బాణాల వెంకటేశ్వర్లు గెలుపు కాంక్షిస్తూ వారి ప్రచారం నిర్వహించారు. అష్ణగుర్తిలో సిపిఎం కంచర్ల అనిత అభ్యర్థి విజయాన్ని కాంక్షిస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ రిజర్వేషన్ల పేరుతో ప్రజలను మోసం చేసిందని మోసపూరిత హామీలు ఇచ్చి నెరవేర్చడం విఫలమైందని అన్నారు. బిఆర్స్, సిపిఎం, తెలుగుదేశం, బిజెపి, జనసేన బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కట్టా కృష్ణార్జున్‌రావు, వనమా విశ్వేశ్వరరావు, దొంతెబోయిన వెంకటేశ్వర్లు, మద్దెల రవి, మాదినేని ప్రసాద్, వజినేపల్లి చక్రవర్తి, నూకల వాసు, మిట్టపల్లి సత్యంబాబు, ఏదునూరి శ్రీను, తాటిపూడి సర్పంచ్ అభ్యర్థి భర్త భద్రయ్య, గొల్లపూడి సర్పంచ్ అభ్యర్థి బాణాల వెంకటేశ్వర్లు, అష్ణగుర్తి సర్పంచ్ అభ్యర్థి కంచర్ల అనిత పాల్గొన్నారు.
స్వాగతం పలికారు. అనంతరం కనకదుర్గమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మీకు సేవ చేయటానికి ఒక్క అవకాశం ఇవ్వండి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** నేను గెలిస్తే, మీరు గెలిచినట్లేనని గెలుపు నా ఒక్కడిదే కాదని, అది మనందరి గెలుపని బేతుపల్లి స్వతంత్ర సర్పంచ్ అభ్యర్థి దొడ్డా రాజేంద్రప్రసాద్ (అమ్ములు) ఓటర్లను వినూత్నంగా ఓటు అభ్యర్థిస్తున్నారు. మండల పరిధిలోని బేతుపల్లి పంచాయతీ నుండి స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచిన దొడ్డా రాజేంద్రప్రసాద్ (అమ్ములు) ప్రచారంలో వేగం పెంచి దూసుకుపోతున్నారు. ఈ నెల 17న జరగనున్న ఎన్నికలలో తనని తన ప్యానెల్ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఇంటింటి ప్రచారంలో దొడ్డా రాజేంద్రప్రసాద్ (అమ్ములు) ఓటర్లను ఓట్లు అభ్యర్థిస్తున్నారు.

## నామినేషన్లు తిరస్కరణపై సబ్ కలెక్టర్ విచారణ



**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరు సబ్ డివిజనల్ పరిధిలోని నామినేషన్లు తిరస్కరణపై కల్లూరు సబ్ కలెక్టర్‌కు అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్లూరులోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో తల్లాడలోని నారాయణపురంలో 13వ వార్డు కు అభ్యర్థి కూతురు కుల సర్టిఫికెట్ పెట్టడంతో నామినేషన్ తిరస్కరణ యదార్థమేనని తెలిపారు. తుమ్మలపల్లి లో ఇద్దరు సర్పంచ్ అభ్యర్థులు 8వ వార్డు నామినేషన్ తిరస్కరణ చేయడంతో సబ్ కలెక్టర్ కోర్టులో అనుమతులు మంజూరు చేశారు. అదేవిధంగా వేంసూరు మండలంలోని కందుకూరులో 14 వ వార్డు బూరుగు సురేష్ నామినేషన్ తిరస్కరణ గురికావడంతో సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ విచారణ అనంతరం తిరస్కరణ సరైనదేనని ఆదేశాలు ఇచ్చారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు సిఐ ముత్తు లింగయ్య ఎస్సై హరిత పోలీస్ బందోబస్తు నిర్వహించారు.

# నేటితో తొలి విడత ప్రచారానికి తెర




**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామ పంచాయతీ ఎన్నికల తొలి విడత ప్రచారానికి నేటితో తెర పడనుంది. డిసెంబర్ 11న పోలింగ్ జరగనుంది. మండలంలో మొత్తం 37 గ్రామ పంచాయతీలు ఉండగా నాలుగు గ్రామ పంచాయతీల పరిధిలోని సర్పంచ్, వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఒక గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానంతో పాటు 12 వార్డుల్లో 10 వార్డులు ఏకగ్రీవం కాగా రెండు వార్డుల్లో పోటీ నెలకొంది. మిగిలిన 32 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబర్ మూడున నామినేషన్ల ఉప సంహరణ అనంతరం పోటీలో ఉన్న అభ్యర్థులు గత ఐదు రోజులుగా గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఎన్నికల ప్రచారానికి నేడు మంగళవారం సాయంత్రం ఐదు గంటలకు తెరపడనుంది. గ్రామాల్లో మైకులు మూగబోనున్నాయి. బహిరంగ ప్రచారం ముగియడంతో ఓటర్లను ప్రసన్నం చేసుకునేందుకు పోటీలో ఉన్న అభ్యర్థులు సిద్ధమయ్యారు. కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులకు దీటుగా బిఆర్ఎస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులు కూడా ఓటర్లకు తులమో ఫలమో అప్పజేప్పేందుకు సిద్ధమయ్యారు.

**-పలు గ్రామాల్లో హోరా హోరీ**



**హోరా హోరీ పోరు :**

గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా రఘునాథపాలెం మండలంలోని పలు గ్రామాల్లో హోరా హోరీ పోరు కొనసాగుతుంది. అధికారి పార్టీ కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులు, బిఆర్ఎస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులు విజయం తమదేనంటూ ప్రచారం సాగిస్తున్నారు. కోయచలక, కోటపాడు, చిమ్మపుడి, బూడిదంపాడు, మంచుకొండ, శివాయిగూడెం, పువ్వాడ నగర్, వి. వెంకటాయపాలెం, వేపకుంట్ల, గణేశ్వరం, పంగిడి, ఈర్లపుడి లతో పాటు గ్రామాల్లో కాంగ్రెస్, బిఆర్ఎస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థుల మధ్య హోరా హోరీ పోరు సాగుతుంది. వి. వెంకటాయపాలెం, పంగిడి గ్రామాల్లో సిపిఐ, కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థుల మధ్య గట్టి పోటీ నెలకొంది. ప్రచారం ముగియడంతో మిగిలిన రెండు రోజులు ఓటర్లను ఎవరు ప్రసన్నం చేసుకుంటారో వారిదే విజయమన్న చర్చ కూడా గ్రామాల్లో జోరుగా సాగుతుంది. ఇప్పటికే పోటీలో ఉన్న అభ్యర్థులు రెండు మూడు సార్లు ఓటర్లను కలిసి తమకు ఓటేయాలని అభ్యర్థించారు. మొత్తంగా మండలంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు హోరాహోరీగా సాగుతున్నాయి.

# 1064 టోల్ ఫ్రీతో అవినీతికి అడ్డుకట్ట




**-అక్రమాల నిర్మూలనలో అందరూ భాగస్వామ్యం కావాలి**
**-పోస్టర్ ఆవిష్కరణలో కలెక్టర్**

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** 1064 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయడం ద్వారా అవినీతికి అడ్డుకట్ట వేయవచ్చునని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అవినీతి నిరోధక వారోత్సవాలను పురస్కరించుకుని పోస్టర్లను, అవినీతి నిర్మూలన నినాదంతో కూడిన క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులు తమ విధి నిర్వహణలో జవాబుదారితనంతో ఉంటూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. మనమంతా నిబద్ధతతో పనిచేసి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలని కలెక్టర్ సూచించారు. అవినీతి, అక్రమాల నిర్మూలనలో అందరూ భాగస్వామం కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రజలను ఎవరైనా లంచం ఇవ్వమని వేధిస్తే 1064 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. ప్రభుత్వ అధికారులతో పని చేయించుకోవడం ప్రజల హక్కు అని, ఆ హక్కును లంచంతో కొనవద్దని, ఎట్టి పరిస్థితుల్లో ఎవరికి ఏ పని కోసం ఒక్క రూపాయి ఇవ్వాల్సిన అవసరం లేదని కలెక్టర్ ప్రజలకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏసిపి డిఎస్‌పి వై. రమేష్, సిఐ బాలాజీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆరు గ్యారంటీలు అమలు చేయని కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించాలి

**సిపిఎం నేత పోతినేని సుదర్శన్‌రావు**



**ప్రజాపక్షం/ బోనకల్ :** ఆరు గ్యారంటీలు పేరు చెప్పి అధికారంలోకి వచ్చి ఆ పథకాలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ప్రజలు ఓడించి నీతినిజాయితీతో పనిచేసే సిపిఎం, బిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. మండల పరిధిలోని చిరునోముల గ్రామంలో బిఆర్ఎస్ బలపర్చిన సిపిఎం అభ్యర్థి నిమ్మతోట శైలజ విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు 10 శాతం కమీషన్లదారుడిగా పేరు సంపాదించారని ఆయన ఎద్దేవా చేశారు. కమీషన్లు లేనిదే డిప్యూటీ సిఎం చేసిన అభివృద్ధి పనులకు నిధులు విడుదల చేయటం లేదని ఆయన ఘాటుగా విమర్శించారు. ఆరు గ్యారంటీ పథకాల్లో కేవలం ఉచిత బస్సు మాత్రమే అమలు జరుగుతుందని, మిగిలిన పథకాలు ఎందుకు అమలు చేయడం లేదో ఓటర్లు ఆలోచించి కాంగ్రెస్ అభ్యర్థులకు ఓట్లు వేయాలని కోరారు. అభివృద్ధి అంటే కమీషన్లు కాదని, ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపర్చడం అన్నారు. నీతి, నిజాయితీగా గ్రామాభివృద్ధికి పాటుపడే బిఆర్ఎస్ బలపర్చిన నిమ్మతోట శైలజను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో నిమ్మతోట రమేష్, బిఆర్ఎస్, సిపిఎం నాయకలుఉ నీలకంఠం రాము, సావిటి పెద్ద లింగయ్య, నర్సింగులు, వరుణ్, రవి, వార్డు అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంపిడిఓ కార్యాలయాన్ని సందర్శించిన డిప్యూటీ కలెక్టర్ శ్రీజ



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** ఎర్రుపాలెం ఎంపిడిఓ కార్యాలయాన్ని జిల్లా స్థానిక ఎన్నికల ప్రత్యేక అధికారి, డిప్యూటీ కలెక్టర్ శ్రీజ సోమవారం సందర్శించారు. ఎన్నికల సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కేంద్రాన్ని సందర్శించారు. ఈ నెల 11న గ్రామపంచాయతీ ఎన్నికల విధులకు హాజరయ్యే ఉద్యోగులు ముందుగానే సోమవారం పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కును ఎంపిడిఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కేంద్రంలో వినియోగించుకున్నారు. మండలంలో ఈ నెల 11న జరుగనున్న ఎన్నికలకు సంబంధించి చేస్తున్న పనులను శ్రీజ పరిశీలించి తగు సూచనలను చేశారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల స్పెలాఫీసర్ విజయ్‌చంద్ర, ఎంపిడిఓ బి.సురేందర్, తహశీల్దార్ మన్నె ఉషాశారద, ఆర్ఐ రవికుమార్, ఎంపిఓ శ్రీలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ బాగం వేణు, పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్ ఎంపిఎస్ఓ జాన్ దర్గాసాహెబ్, పిఓలు, ఓపిఓలు, జిపిఓలు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

# తోట దీపికలను గెలిపించండి



**ప్రజాపక్షం/ మధిర :** మధిర మండలం మాటూరుపేట జనసేన, బిజెపి, బిఆర్ఎస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి తోట దీపికల విజయాన్ని కాంక్షిస్తూ కొణిదెల నాగబాబు సతీమణి కొణిదెల పద్మావతి సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఉపకారం చేయలేవు కాని అపకారం చేయకూడదని ప్రజలకు చేసే సేవలో చెప్పలేని ఆనందం సంతృప్తి ఉంటుందని అన్నారు. జనసేన పార్టీ అధినేత డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్ అడుగుజాడల్లో నడుస్తూ మాటూరుపే గ్రామ జనసేన, బిజెపి, బిఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న తోట దీపికలను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సర్పంచ్ అభ్యర్థి దీపికల మాట్లాడుతూ సర్పంచ్‌గా నన్ను గెలిపిస్తే మాటూరుపేట అభివృద్ధికై ముందుకు నడుస్తానని, జనసేన ఆశయాలతో ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటూ అన్ని సమస్యలపై పోరాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమం జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు తాళ్ళూరు డేవిడ్, మండల నాయకులు భద్ర రామకృష్ణ, జనసేన, బిజెపి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థి జడల సుష్మను గెలిపించండి



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** పాతర్లపాడు గ్రామపంచాయతీలో కులమతాలకతీతంగా అన్ని పార్టీల నిర్ణయం మేరకు పాతర్లపాడు గ్రామపంచాయతీని ఏకగ్రీవం చేయాలని నిర్ణయానికి వస్తే కొందరు స్వార్థపరులు అడ్డుకున్నారని, నామినేషన్ ఉప సంహరణ చివరి సమయం వరకు ఎదురు చూశామని, చివరికి నామినేషన్ ఉపసంహరించుకోకపోవడంతో ఎన్నికల్లో పాల్గొనాల్సి వస్తుందని పాతర్లపాడు కాంగ్రెస్ అభ్యర్థి జడల సుష్మ గెలుపు ఎవరు ఆపలేరని మండల కాంగ్రెస్ నాయకులు మద్దులపల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ జనరల్ నగేష్‌గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిరుపేదల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులను గెలిపిస్తాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తంబూరి దయాకర్‌రెడ్డి ఆశీస్సులతో రామసహాయం నరేష్‌రెడ్డి చావా శివరామకృష్ణ, జగల నాగేష్ గౌడ సూచనల మేరకు పాతర్లపాడు కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థిగా జడల సుష్మ పోటీ చేస్తున్న సందర్భంగా ఆమె గెలుపు ఇప్పటికే దాదాపు ఖాయం అయినట్లు ప్రజల ఒక నిర్ణయానికి వచ్చినట్లు ఆయన తెలిపారు. పాతర్లపాడులో సుష్మ గెలుపు ద్వారా గ్రామంలో మౌలిక వసతుల కల్పనకు ఆమె శక్తివంచన లేకుండా కృషి చేస్తుందని అన్నారు. పాతర్లపాడు గ్రామ ప్రజలంతా కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి జడల సుష్మ గుర్తు కత్తెర గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

# కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డిని గెలిపించండి



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** కాకరవాయి గ్రామంలో కాంగ్రెస్ అభ్యర్థి కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి గెలుపు దాదాపు ఖాయమైనట్లు తెలుస్తుంది. కాంగ్రెస్ అభ్యర్థి శ్రీనివాస్‌రెడ్డికి సిపిఐ, ప్రజాపంధా మాస్ లైన్ బిజెపి పార్టీలు మద్దతు పలకటం గెలుపు సులభతరం అయినట్లు స్థానిక ప్రజలు భావిస్తున్నారు. మంత్రి పొంగులేటి శ్రీవాస్‌రెడ్డి ఆశీస్సులతో తంబూరు దయాకర్‌రెడ్డి, రామసహాయం నరేష్‌ఱెడ్డి, చావా శివకృష్ణ సూచనల మేరకు కాకరవాయి కాంగ్రెస్ అభ్యర్థిగా నామినేషన్ వేయటం భారీ మెజార్టీ తో గెలుపు దాదాపు ఖాయం అయిందని మాజీ ఎంపిపి బోడ మంగీలాల్ నాయక్ అన్నారు. కాకరవాయి గ్రామంలో కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి గెలుపుకై ఇంటింటి ప్రచారంలో పాల్గొని విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజల కోసం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థులను గెలిపిస్తాయని అన్నారు. కాకరాయి గ్రామం కాంగ్రెస్ అభ్యర్థి కట్కూరు శ్రీనివాస్‌రెడ్డి గెలిస్తే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. కాకరవాయి గ్రామ ప్రజలంతా కట్కూరి శ్రీనివాస్‌రెడ్డి గుర్తు బ్యాట్ గుర్తుపై తమ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు దంతాల బాలరాజు, రామ్మోహన్‌రావు, గుర్రాల శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వరి కొయ్యలను కాల్చకండి

**జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య**




**ప్రజాపక్షం/వైరా:** జిల్లా వ్యవసాయ అధికారి దనసరి పుల్లయ్య సోమవారం వ్యవసాయ సాంకేతిక సంస్థ పిడి భూక్యా సరిత, కెవికె కోఆర్డినేటర్ సుచరితదేవి, వైరా డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు తుమ్మలపల్లి కరుణతో కలిసి గండగలపాడు గ్రామంలో క్షేత్ర ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులు ఎవరు తమ పంట అవశేషాలను కాల్చకూడదని చెప్పడం జరిగింది. పంట అవశేషాలను కాల్చడం వలన నేలలో కర్బన శాతం తగ్గి భూమిలో ఉన్న సారం తగ్గిపోతోంది. అదేవిధంగా పంటకి ఉపయోగపడే సూక్ష్మ జీవులు చనిపోతాయి. పంట వ్యర్థాలను కలియదున్నడం వలన కర్బన శాతం పెరిగి భూమిలో సేంద్రీయ ఎరువుగా మారుతుందని రైతులకి సూచించారు. ఈ కార్యక్రమంలో రైతులు కొల్లి శ్రీనివాసరావు, కొల్లి నర్సింహారావు, బెజవాడ నాగేశ్వరరావు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరు సబ్ డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కవాతు




**ప్రజాపక్షం/మణుగూరు:** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో మణుగూరు సబ్ డివిజన్ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి, మణుగూరు సిఐ నాగబాబు, ఈ బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, అశ్వాపురం సీఐ అశోక్ రెడ్డి, ఎస్సైలు నగేష్ కుమార్, శ్రావణ్ కుమార్, రాజేష్, ఏఎస్ఐలు శాంతి, జ్యోతి, రామచంద్రారెడ్డి , నిరోష, ఝాన్సీ, సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి బాసటగా...



**ప్రజాపక్షం/ములకలపల్లి:** అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయిన బాధిత కుటుంబానికి సిపిఐ ఎంఎల్ మాస్‌లైన్ నాయకులు అండగా నిలిచారు. రాచన్నగూడెం గ్రామానికి చెందిన మడేవి సునీత, వెంకటేష్ దంపతుల ఇల్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి దగ్ధం కాగా, సర్వస్వం కాలిపోయాయి. దీంతో మాస్‌లైన్ నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఇంటి నిర్మాణానికి కావలసిన రేకులను ఏడు వేల రూపాయల వ్యయంతో కొని ఇచ్చారు. నిత్య వసర వస్తువులు, రగ్గులు, 1500 రూపాయల నగదు వితరణగా అందజేశారు. మాజీ సర్పంచ్ కొర్సా గణపతి, మాజీ ఎంపిటిసి మడకం విజయ, మాజీ ఉపసర్పంచ్ ఒగ్గల వెంకటేష్, రాచన్నగూడెం గ్రామ పెద్ద మనిషి మడకం లక్ష్మయ్య, నాయకులు పద్దం లక్ష్మణరావు, కొప్పుల మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ఖర్చు వివరాలు పారదర్శకంగా ఉండాలి



**ప్రజాపక్షం/పాల్వంచ :** స్థానిక సంస్థల ఎన్నికలలో అభ్యర్థులు చేసే ఖర్చుల వివరాలను పూర్తి పారదర్శకంగా నిర్వహించాలని, తప్పులు చేస్తే తగిన మూల్యం చెల్లిస్తారని ఎన్నికల వ్యయాల జిల్లా నోడల్ అధికారి ఏ. శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఎంపిడిఓ కార్యాలయంలో సర్పంచ్, వార్డు మెంబర్లుగా పోటీ చేస్తున్న అభ్యర్థులకు సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అభ్యర్థులు ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటించాలని సూచించారు. ఎన్నికల్లో ఖర్చు చేసిన ప్రతీ పైసాకు ఖచ్చితమైన లెక్కలు రాయాలన్నారు. ముందుగా రెండవ దశలో జరిగే గ్రామ పంచాయితీ ఎన్నికలల్లో వ్యయం, ప్రవర్తనా నియమావళిపై అధికారులకు శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జెడ్‌పి సిఈఓ నాగలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు పెట్టే ఖర్చు వివరాలపై నిశితంగా గమనించాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా, నియమాలను అతిక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ వ్యయాల అధికారి కే. శ్రీదేవి, తహశీల్దార్ దారా ప్రసాద్, ఎంపిడిఓకుడుముల విజయ భాస్కర్‌రెడ్డి, గ్రామీణ పోలీస్ స్టేషన్ ఎస్ఐ. సురేష్, శిక్షకులు రమేష్, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వంతోనే సమగ్ర అభివృద్ధి



**ప్రజాపక్షం/కరకగూడెం:** కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం తోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమౌతోందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. కరకగూడెం మండలంలో స్థానిక గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశానుసారం కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులు, కరకగూడెం పోలేబోయిన సుజాత, కొత్తగూడెం ఎర్రం పొట్టయ్య, వార్డు సభ్యుల గెలుపు కొరకు వారికి కేటాయించిన గుర్తుల పై మీ అమూల్యమైన ఓటువేసి గెలిపించాలని ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు నాగ బండి వెంకటేశ్వర్లు, మండల నాయకులు జలగం కృష్ణ, గోగ్గల రవి,షేక్ రఫీ, మేడి శ్రీను, బిలపాటి సంపత్, వార్డు మెంబర్ అభ్యర్థులు, కార్యకర్తలు మహిళలు యువకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## డివైడర్ నిర్మాణ పనుల్లో జాగ్రత్తలు తీసుకోండి




**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** జలగం నగర్ నుండి వరంగల్‌క్రాస్‌రోడ్డు వరకు నిర్మాణం చేపడుతున్న డివైడర్ పనుల్లో భద్రాతా చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ పాలేరునియోజకవర్గ నాయకుడు మామిండ్ల శ్రీనాథ్‌రెడ్డి అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు పెద్దతండా లోని ఏదులాపురం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రాన్ని అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...కంకర, ఇసుక కుప్పలు రోడ్డుపై పోసి అలాగే వదిలేయడంతో రాత్రి పూట వాహనదారులు ప్రమాదాలకు గురై తీవ్ర గాయాల పాలవుతున్నట్లు పేర్కొన్నారు. కావున ప్రమాదాలు జరగకుండా తగు నివారణ చర్యలు తక్షణమే తీసుకొని సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు ఘనపరపు ఉపేందర్, మామిడాల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# సిపిఐ బలపర్చిన అభ్యర్థులను గెలిపించండి

**- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని**



**ప్రజాపక్షం/ బోనకల్ :** నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రజాక్షేత్రంలో ఉంటూ పోరాడే సిపిఐ బలపరిచే అభ్యర్థులను సర్పంచ్‌లుగా, వార్డు సభ్యులుగా గెలిపించాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో సిపిఐ, టిడిపి బలపర్చిన కాంగ్రెస్ అభ్యర్థి ఈవి కనకతారను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని రైతు సంఘం నాయకులు పారుపల్లి నర్సింహారావు ఇంటి వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పార్టీలకతీతంగా పేదలకు అభివృద్ధి ఫలాలు అందించేందుకు గత రెండేళ్లుగా ఆహర్నిశలు కృషి చేస్తున్నామని అన్నారు. అవకాశవాద రాజకీయాలు చేస్తూ ఓట్ల కోసం ఇళ్లముందుకు వచ్చే వారిని తగిన బుద్ధి చెప్పాలని, పార్టీలకతీతంగా పేదలకు అండగా రెండేళ్లుగా చేస్తున్న పనులు గమనించి స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులను ఎన్నుకోవాలని అన్నారు. పార్టీ సిద్ధాంతాలను కట్టుబడి సిపిఐ బలపర్చిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండి నిత్యం ప్రజల పక్షాన నిలబడే కమ్యూనిస్టు పార్టీ బలపర్చిన అభ్యర్థులు గెలుపించాలని కోరారు. సిపిఐ అభ్యర్థులకు ఖచ్చితంగా గెలిచి తీరాలని సూచించారు. గెలుపు అనంతరం మరోసారి మండలంలో పర్యటిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వరరావు, తోట రామాంజనేయులు, ఏనుగు గాంధీ, మండల కార్యదర్శి యంగల ఆనందరావు, సిపిఐ నాయకులు కొంగర రామారావు, సహాయ కార్యదర్శి బుర్రి నాగేశ్వరరావు, ఆకెన పవన్, రైతు సంఘం నాయకులు పారుపల్లి నర్సింహారావు, కొంగర భాస్కర్‌రావు, గుడిద కృష్ణ, వంగాల కృష్ణ, సిపిఐ అభ్యర్థులు, కాంగ్రెస్ యూత్ నాయకులు బంధం రంగా, అనీల్ తదితరులు పాల్గొన్నారు.

# గంగారం పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** గంగారం గ్రామాభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడతానని,తనను గెలిపిస్తే గ్రామాభివృద్ధి ప్రదాత దాసరి మదుమోహన్ రెడ్డి సహకారంతో తొలి సంతకం ఇంటిగ్రేటెడ్ పంచాయతీ కార్యాలయ నిర్మాణానికి చేయటంతో పాటు తొలి శంకుస్థాపన కూడా చేస్తానన్నారు సర్పంచ్ అభ్యర్థిని కాకర్ల రేవతి. ఈ నెల 17న జరగనున్న పంచాయితీ ఎన్నికల నేపద్యంలో గంగారం గ్రామంలో కాకర్ల రేవతి, వార్డు సభ్యులు ఇంటింటికి తిరుగుతూ ఓట్లను అభ్యర్ధించారు.తనను, తన ప్యానల్ ను అత్యదిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. ఈ సంసర్భంగా సర్పంచ్ అభ్యర్థిని కాకర్ల రేవతి మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు దయానంద్, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు దాసరి వెంకటరామిరెడ్డి, మధుబాబు ఆశీస్సులతో గ్రామాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్ది, ఆదర్శవంతమైన పంచాయితీగా గంగారం గ్రామాన్ని రాష్ట్రంలో ఆదర్శ గ్రామ పంచాయితీగా నిలిపి గ్రామ ప్రజల గౌరవం పెంచుతానని కాంగ్రెస్ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి కాకర్ల రేవతి తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో తనతో పాటు కాంగ్రెస్ వార్డు సభ్యులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. నాయకులు మధుబాబు సహకారంతో ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయిస్తానని, ఇండ్ల స్థలం లేని నిరుపేదల కోసం ప్రభుత్వ భూమి కేటాయించి ఇందిరమ్మ ఇల్లు కట్టిస్తానన్నారు. నిరుద్యోగులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు లైబ్రరీ ఏర్పాటు, మహిళల కోసం గంగారం చెరువులో బతుకమ్మ ఘాట్, ఫుట్‌పాత్ వ్యాపారుల కొరకు స్థలం కేటాయింపులు చేపడతానన్నారు. వడ్డెర బస్తీని ఆదర్శవంతమైన కాలనీగా తయారు చేస్తానని, ఎస్సీ, ఎస్టీ కాలనీల అభివృద్ధి కోసం మధుబాబు సహకారం తీసుకుంటానని హామీ ఇచ్చారు.

# విధుల్లో ఉపాధ్యాయుడి నిర్లక్ష్యం..!

**-శాంతినగర్ హాస్టల్ విద్యార్థికి రోడ్డు ప్రమాదం**
**-ఘటన వివరాలను గోప్యంగా ఉంచుతున్న ఉపాధ్యాయ బృందం**



**ప్రజాపక్షం/కారేపల్లి:** విధుల్లో ఓ ఉపాధ్యాయుడి నిర్లక్ష్యం వల్ల హాస్టల్ విద్యార్థులపై పర్యవేక్షణ కరువైంది. ఉపాధ్యాయుడు హాస్టల్‌లో లేకపోవడంతో ఓ విద్యార్థి హాస్టల్ నుండి బయటికి వెళ్లి రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. ఈఘటనలో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థి ఘటన స్థలం స్థానికులు తెలిపిన కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. కారేపల్లి మండల పరిధిలోని శాంతినగర్ ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సాగర్ కొంత మంది స్నేహితులతో కలిసి వ్యక్తిగత పనుల కోసం ఇల్లందుకు వచ్చారు, పాఠశాలకు వెళుతున్న క్రమంలో ద్విచక్ర వాహనం ఢీ కొని రోడ్డు ప్రమాదం జరగడంతో తీవ్రగాయాలయ్యాయి. ఆ విద్యార్థి పరిస్థితి విషమంగా ఉండటంతో ఖమ్మం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు పాఠశాలలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. విద్యార్థికి రోడ్డు ప్రమాదం జరిగిన విషయాన్ని ఉపాధ్యాయ బృందం గోప్యంగా ఉంచుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఈ సంఘటన వివరాల కోసం ఏటిడిఓకు వివరణ కోసం ప్రయత్నించగా రెండుసార్లు ఫోన్ చేయగా స్పందించలేదు.

# కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

**- జగన్నాథపురం ప్రచారంలో కోనేరు చిన్ని**




**ప్రజాపక్షం/పాల్వంచ :** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ నాయకులు కోనేరు చిన్ని అన్నారు. మండల పరిధి జగన్నాథపురంలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి బానోత్ అనిత విజాయాన్ని కాంక్షిస్తూ సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయనకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. వందలాది మందితో ప్రచారాన్ని హోరెత్తించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టి అమలు చేస్తున్న నూతన రేషన్ కార్డులు, రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు సన్న బియ్యం పంపిణి, రైతాంగానికి అండగా సన్న రకం దాన్యానికి రూ.500/లబోనస్, రైతుభరోసా, రెండు లక్షల రుణమాఫి, పేదలకు ఇందిరమ్మ ఇండ్లు తదితర సంక్షేమ పథకాలను వివరిస్తూ, వాడ, వాడకు, ఇంటింటికి, గడప గడపకు తిరుగుతూ ప్రజలను ఓట్లడిగారు. ఉంగరం గుర్తుపై ఓటేసి సర్పంచ్‌గా బానోత్ అనితను బంపర్ మెజారిటో గెలిపించాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అడ్డా అని మరోమారు నిరూపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దమ్మతల్లి గుడి ధర్మకర్తల మండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అథారిటీ కన్వీనర్ బాదర్ల జోషి కుమార్, పెద్దమ్మతల్లి గుడి ధర్మకర్తల మండలి సభ్యులు పెండ్లి రామిరెడ్డి, బాదర్ల నాగేశ్వరరావు, మాజీ జెడ్‌పిటిసి నందా నాయక్, మాజీ ఎంపిటిసి రాదారపు శ్రీను, కుమార్, కార్తీక్,సత్యాల పెద్దయ్య, ధర్మపురి ప్రసాద్, మాలోత్ లోక్యా, తోట క్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# విజయా నర్సింగ్‌హోమ్‌ను సీజ్ చేయాలి

**- ఆసుపత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలి**
**- బాధిత మాహిళతో ఆదివాసీ నాయకుల డిమాండ్**




**ప్రజాపక్షం/పాల్వంచ :** పాల్వంచ దమ్మపేట రహదారిలోగల విజయా నర్సింగ్‌హోమ్‌ను సీజ్‌చేసి ఆసుపత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదివాసీసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బాధిత మహిళ కుంజా భవానితో కలిసి సోమవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ముందుగా భవాని మాట్లాడుతూ నెల నెలా విజయా నర్సింగ్ హోమ్‌లోనే చికిత్స తీసుకొన్నట్లు చెప్పారు. గత నెల 26వ, తేదీ ఉదయం 4 గంటలకు నొప్పులు రావటంతోనే వెంటనే మా ఇంటి ముందున్న ఆటోలో 4.30 వరకు ఆసుపత్రికి వెళ్ళానని అన్నారు. ఆ సమయంలో డాక్టర్ లేరని, సమాచారం అందిచిన సిబ్బంది డాక్టర్ సూచనలతో ప్రాథమిక వైద్యం అందించారని, అనంతరం దాదాపు 8:30 గంటల సమయంలో వైద్యులు వచ్చి హడాహుడిగా ఆపరేషన్ గదిలోకి తీసుకెళ్ళి ఆపరేషన్ చేసి డెలివరి చేశారని తెలిపారు. అనంతరం శిశువుకు ఆరోగ్య పరీక్షలు చేయటానికి రూ. 1800/ల అదనపు ఫీజు మాట్లాడి పిల్లల డాక్టర్‌ను రప్పించారని, పరీక్షించిన పిల్లల డాక్టర్, ఆసుపత్రి యాజమాన్యం మట్లాడుకొని బాబు మృతి చెందిన విషయాన్ని మా అత్తగారితో చెప్పారని అన్నారు. సకాలంలో వైద్య పరీక్షలు నిర్వహించి వైద్యం అందిస్తే మా బాబు బతికేవాడన్నారు. ఆలస్యంగా వైద్యం అందించిన కారణంగానే నా కొడుకు చనిపోయాడని ఆరోపణలు చేసింది. అనంతరం ఆదివాసీ ఐకాస రాష్ట్ర కన్వీనర్ వాసం రామక్రిష్ణ దొర, ఆదివాసీ జేఏసి రాష్ట్ర నాయకులు సోయం సత్యనారాయణ, జిఎస్ఎస్ రాష్ట్ర నాయకులు ఆరెం ప్రశాంత్‌లు మాట్లాడుతూ వైద్యులు అంటే భగవంతుడితో సమానమన్నారు. వారిని మేమెప్పుడు గౌరవిస్తామన్నారు. కానీ కొందరు వైద్యులు ఆదివాసీల పట్ల చిన్నచూపు చూస్తున్న తీరు బాదాకరమన్నారు. విజయా నర్సింగ్‌హోమ్‌లో కుంజా భవానికి జరిగిన నష్టం ముమ్మాటికి వైద్యుల నిర్లక్ష్యం వలనే జరిగిందని ఆరోపించారు. 24 గంటల వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని ప్రచారం నిర్వహిస్తున్న ఆసుపత్రిలో డ్యూటీ డాక్టర్ లేకపోవటం దేనికి సంకేతమని ప్రశ్నించారు. 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉంటే భవాని కొడుకు మృతిచెందేవాడు కాదన్నారు. భవానికి జరిగిన నష్టానికి ఏమాత్రం బాదపడకుండా, అశ్వారావుపేట ప్రభుత్వ ఆసుపత్రిలో అనస్థీషియా వైద్యులుగా విధులు నిర్వహిస్తున్న ఓ వైద్యులు బాహటంగా ప్రవేటు ఆసుపత్రికి వత్తాసు పలుకుతూ ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్ పెట్టి కుంజా భవానికి వ్యతిరేకంగా శిశువు మృతికి విజయా నర్సింగ్ హోమ్‌కు ఎటువంటి సంభంధం లేదని చెప్పటం బాద్యతారాహిత్యమని మండిపడ్డారు. 24 గంటల వైద్యం అందిస్తామంటూ తప్పుడు ప్రకటనలు చేస్తూ ప్రజలను నమ్మించి మోసం చేస్తున్నారని ఆరోపించారు. ప్రసవం సమయంలో ఆపరేషన్‌కు ముందు పాతోగ్రామ్ వంటి కీలక పరీక్షలు చేయకపోవటం, పేషెంట్ కేస్‌షీట్ లేకపోవటంతో ఆసుపత్రి వైద్యులపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. జరిగిన ఘటనపై విచారణ కోసం ఆసుపత్రికి వచ్చిన డిప్యూటీ డిఎంఅండ్‌హెచ్ఓ జయలక్ష్మిని చూసి ఆసుపత్రి ప్రధాన వైద్యురాలు ప్రాంగణాన్ని విడిచిపోవటం, అతిముఖ్యమైన పేషెంట్ కేస్‌షీట్ ఆసుపత్రిలోలేకపోవటం, అధికారులు కోరిన పేషెంట్ తాలూకూ రికార్డుల వివరాలు ఆసుపత్రి యాజమాన్యం అందించకపోవటం వలన అనేక అపోహలకు దారితీస్తుందన్నారు. ఘటన సమయంలో డ్యూటీ డాక్టర్ లేకపోవటం, ఆసుపత్రి రికార్డుల్లో మార్పులు వంటి అనేక లోపాలు అధికారుల దృష్టికి వచ్చిందని తదుపరి విచారణ కొనాగిస్తామని తెలిపిన అధికారి ఇప్పటి వరకు ఘటనపై ఎలాంటి నివేదిక విడుదల చేయలేదని వాపోయారు. బాదిత మహిళకు వ్యతిరేకంగా ప్రెస్‌మీట్ పెట్టి ప్రభుత్వ వైద్యుడిని సస్పెండ్ చేయాలని, 24 గంటలు వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని తప్పుడు ప్రచారాలు చేసి ప్రజలను మోసం చేస్తున్న ఆసుపత్రి యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకొని ఆసుపత్రిని సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేని యెడల స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తి అయిన తరువాత ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో కార్యాచరణ రూపొందించి ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు శెట్టిపల్లి వెంకటేశ్వర్లు, కాకా పృథ్వీ, తాటి పుల్లయ్య, బాదిత భవాని కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ రెబల్ అభ్యర్థులు గీత దాటితే వేటు తప్పదు



**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** మండలంలోని ఆయా గ్రామపంచాయతీల్లో కాంగ్రెస్ అభ్యర్థులు పార్టీ నిర్ణయం మేరకు మా పంచాయతీ సర్పంచ్ అభ్యర్థులుగా పోటీలో ఉన్నారని, వారికి అన్నివిధాల సహకరిస్తూ గెలుపులో భాగస్వామ్యులు కావాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నర్శ్‌రెడ్డి అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆశీస్సులతో మండలంలో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులు గెలవబోతున్నారని, కొన్ని గ్రామాల్లో కాంగ్రెస్ అభ్యర్థులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీకి చెందిన ఇద్దరు ముగ్గురు నామినేషన్లు వేశారని పార్టీ సూచనల మేరకు కొందరు నామినేషన్‌లు ఉపసంహరించుకుని బరిలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులు గెలుపుకు సహకరిస్తుంటే కొందరు వ్యతిరేకంగా పోటీలో ఉన్న కాంగ్రెస్ అభ్యర్థులకు గ్రామాల్లో ప్రచారాలు చేస్తున్నారని కాకరవాయి గ్రామానికి చెందిన గూడూరు ఉపేందర్, గూడూరు ఉమామహేశ్వరరావు, గుండాల ఎల్లయ్య, సురిగి రాములు, బీరోలు గ్రామంలో మిరియాల విక్రంరెడ్డి, గుండా రఘురాంరెడ్డి, బత్తిని సీతారాములు పానుగంటి పుల్లారెడ్డి, క్రమశిక్షణ చర్యల్లో భాగంగా జిల్లా పార్టీ నిర్ణయం మేరకు వారిని కాంగ్రెస్ పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు వారికి సహకరిస్తున్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బెల్లం శ్రీనివాస్‌ను తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో నాయకులకు కార్యకర్తలకు కష్టపడే వారికి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సముచిత స్థానం కల్పిస్తారని, పార్టీ నిర్ణయాన్ని దిక్కరిస్తే ఎవరికైనా వేటు తప్పదని రామసహాయం నరేష్‌రెడ్డి హెచ్చరించారు.

# దమ్మలపాటికి నివాళులర్పించిన సండ్ర



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** మండల పరిదిలోని రేజర్ల గ్రామానికి చెందిన నమస్తే తెలంగాణ సత్తుపల్లి డివిజన్ సీనియర్ రిపోర్టర్ దమ్మాలపాటి సత్యనారాయణ అనారోగ్యంతో హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతి చెందారు. మృతదేహాన్ని వారి స్వగృహం రేజర్లకు సోమవారం ఉదయం తీసుకురాగా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య రేజర్లలోని వారి నివాసానికి వెళ్లి పార్థివ దేహాన్ని సందర్శించి పూలమాల వేసి, ఘన నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సండ్ర వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, చాంద్ పాషా తదితరులున్నారు.

### జర్నలిస్టులు నివాళి...

నమస్తే తెలంగాణ డివిజన్ రిపోర్టర్, సీనియర్ జర్నలిస్టు దమ్మాలపాటి సత్యనారాయణ మృతికి జర్నలిస్టు నాయకులు, ఆయా సంఘాల బాధ్యులు సంతాపం తెలిపారు. సత్యనారాయణ మృతి జర్నలిస్ట్ రంగానికి తీరని లోటని, ప్రజా సమస్యలు వెలికి తీసి, వాటి పరిష్కారంలో సత్యనారాయణ కలం ముందుండేదన్నారు. సౌమ్యుడిగా ఉంటూ తన దైన పందాలో అధికార పార్టీ తప్పులను ఎత్తిచూపుతూ, పాటకుడికి అర్థమయ్యే రీతిలో పదాలను చేర్చి వార్తను పాఠకులకు అందించే వారిని ఆయన కుటుంబానికి భగవంతుడు ఈ కష్ట సమయంలో అండగా నిలవాలన్నారు. నివాళులర్పించిన వారిలో షైబుద్దీన్, దేవా, రాము, ఖాదర్, బాలకృష్ణ, చిరంజీవి, శ్రీకాంత్, గురవయ్య , సురేష్, అప్పారావు, పూరేటి శ్రీను తదితరులున్నారు.

## గుమ్మడి కృష్ణవేణిని గెలిపించండి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** మండల పరిధిలోని తాళ్లగొమ్మూరు గ్రామ పంచాయితీలో ఈనెల 11న జరగబోయే పంచాయితీ ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి గుమ్మడి కృష్ణవేణి ఎన్నికల ప్రచారంలో బూర్గంపాడు మాజీ జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత పాల్గొన్నారు. ఈ ప్రచారంలో భాగంగా గడప గడపకి వెళ్లి ప్రజలందరు బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గుమ్మడి కృష్ణవేణి ఉంగరం గుర్తుకి, వార్డు మెంబర్లకు ఓటు వేసి అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల నాయకులు, సర్పంచ్ అభ్యర్థి, వార్డు మెంబర్లు, మాజీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## శాంతియుతంగా ఎన్నికలు నిర్వహించుకోవాలి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించుకోవాలని పాల్వంచ డిఎస్‌పి ఆర్ సతీష్‌కుమార్ అన్నారు. సోమవారం బూర్గంపాడు గ్రామ పంచాయితీ ఆవరణలో సర్పంచ్ అభ్యర్థులుగా, వార్డు మెంబర్లుగా పోటీ చేస్తున్న అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల వేళ శాంతి భద్రతలకు విఘాం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రచార సమయంలో ఒకరికొకరు ఎదురుపడకుండా సమస్యలు సృష్టించకుండా చూసుకోవాలసిన బాధ్యత సంబంధిత పోటీ చేసే అభ్యర్థులదేనని పేర్కొన్నారు. ప్రచార విషయంలో వివిధ రాజకీయ పార్టీలు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు, గొడవలు జరగకుండా ప్రచారం నిర్వహించుకోవాలన్నారు. డబ్బు, మద్యం పంచుతున్నట్లు తెలిసిన వెంటనే సీజ్ చేసి, సంబంధిత అభ్యర్థులపై కేసులు నమోదు చేయడానికి వెనకాడమని తెలిపారు. ఓటర్లను ప్రలోభ పెట్టే విషయమై పోలీసులకు ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకునేలా పకడ్బందీగా భద్రతా ఏర్పాట్లను పూర్తి చేసినట్లు వెల్లడించారు. ఈకార్యక్రమంలో తహసీల్ధార్ కెఆర్‌కె ప్రసాద్, సిఐ సతీష్‌కుమార్, ఎంపిడివో జములారెడ్డి, ఎస్ఐ మేడా ప్రసాద్, అదనపు ఎస్ఐ నాగబిక్షం, ట్రైనీ ఎస్ఐ దేవ్‌సింగ్, కార్యదర్శులు బర్ల ప్రభాకర్ రావు, బాలయ్య, సర్పంచ్, వార్డు అభ్యర్థులు పాల్గొన్నారు.

## మండల విద్యాధికారిని కలిసిన టిఎస్ యుటిఎఫ్ మండల నూతన కమిటీ





**ప్రజాపక్షం/బూర్గంపాడు:** ఇటీవల జరిగిన బూర్గంపాడు మండల టిఎస్‌యూటిఎఫ్ మహాసభలో మండల అధ్యక్షులుగా ఎన్నికైన బి బాలు, ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన ఎం సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన తేజావత్ రమేష్, మహిళా ఉపాధ్యక్షురాలుగా పి ఉమాదేవి, కోశాధికారిగా డిఏ రామకృష్ణ, మహిళా కార్యదర్శిగా ఎంజే విజయశ్రీ, మహిళా కన్వీనర్‌గా బి అనిత, ఎఫ్‌డబ్ల్యూఎఫ్ కన్వీనర్‌గా సిహెచ్ శ్రీనివాస్, ఆడిటర్‌గా బి శివరాం, కార్యదర్శులుగా ఎస్ జనార్ధన్, టీవీఎస్ ప్రసాద్, ఎం శేషాచార్యులు, పి సత్యనారాయణ, జె స్వర్ణ కుమారి ఎన్నిక కాగా నూతన కమిటీతో కూడిన లిస్టును మండల విద్యాధికారి యదు సింహరాజుకి అందించి, పరిచయం చేశారు. ఈసందర్భంగా మండల విద్యాశాఖ అధికారి నూతన కమిటీ వారికి శుభాభినందనలు తెలియజేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో క్రియాశీలమైన పాత్ర వహిస్తూ పని చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు తెలియజేశారు.

## ఎన్నికల నియమావళిని పాటించాలి



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** ఎన్నికల ప్రవర్తన నియమావళిని ప్రతి ఒక్కరకు గౌరవించాలని, అమలు చేయాలని, ఉల్లంఘించి కేసులో ఇరుక్కోవద్దని ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కొత్తగూడెం డిఎస్‌ని అబ్దుల్ రహమాన్ అభ్యర్థులకు సూచించారు. సోమవారం స్థానిక రైతువేదిక నందు ఏర్పాటు చేసిన ఎన్నికల ప్రవర్తన నియమాళిపై అవగాహన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎన్నికల్లో గెలుపు ఓటములు సహజమని, ఎవరు గెలిచిన ఓడిన హేళన చేయటం, గొడవలు పెట్టడం సరికాదన్నారు. ఒకరి మనోభావాలు దెబ్బతీసే విధంగా ప్రవర్తించడం తగదన్నారు. రాజకీయ పార్టీలు సైతం తమ అభ్యర్థులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు. ఎన్నికల కేసులు నమోదు అయితే ఇకపై ఎన్నికల్లో పోటీ చేయడం కుదరదన్నారు. ఓటర్లను మభ్యపెట్టడం, బెదిరించడం సైతం చట్ట ఉల్లంఘన క్రిందకే వస్తుందన్నారు. ఎన్నికల నిబంధనల మేరకు మాత్రమే ఖర్చులు చేయాలని అభ్యర్థులకు సూచించారు. ఈసమావేశంలో స్టేట్ అబ్జర్వర్ లావణ్య, ఎంపీడీవో అశోక్, తహసీల్ధార్ సంధ్యారాణి, జూలూరుపాడు సిఐ శ్రీలక్ష్మి , ఎస్ఐ, పంచాయితీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

# నేతాజీ గెలుపు నేరడ అభివృద్ధికి మలుపు

**-మా ఇంటి బిడ్డను ఆశీర్వదించండి**
**-నేరడ రోడ్ షోలో మల్లు నందిని, కూనంనేని**





**ప్రజాపక్షం/చింతకాని :** నేతాజీ గెలుపుతో నేరడ గ్రామ పంచాయతీ అభివృద్ధి మలుపు తిరుగుతుందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందినీ విక్రమార్క పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ మద్దతుతో నేరడ గ్రామపంచాయతీ సిపిఐ అభ్యర్ధి దూసరి నేతాజీ విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం నేరడ గ్రామంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందినీ విక్రమార్క ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన రోడ్‌షోలో కూనంనేని మాట్లాడుతూ నేతాజీ గెలుపుతోనే నేరడ అభివృద్ధి చెందుతుందని గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేసే నేతాజీ ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. దాదాపు నేతాజీ గెలుపు ఖాయమైందని మంచి మెజార్టీ కోసం ఈ మూడు రోజులు అవిశ్రాంతంగా పనిచేయాలని కార్యకర్తలకు సూచించారు. మల్లు నందిని మాట్లాడుతూ అధికార పార్టీ బలపర్చిన సిపిఐ అభ్యర్థిని గెలిపిస్తే ప్రభుత్వం నుండి రావాల్సిన అన్ని రకాల సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన అందరికీ అందిస్తామని ఆమె హామీ ఇచ్చారు. నేరడ గ్రామంతో తమకు ప్రత్యేక అనుభంధం ఉందని నేతాజీ మా ఇంటి బిడ్డ అని నేతాజీని భారీ మెజార్టీతో గెలిపిస్తే నేరడ అభివృద్ధి భాధ్యత తనదేనని వాగ్దానం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జునరావు, మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంబటి వెంకటేశ్వర్లు, మహిళా అధ్యక్షురాలు తోటకూరి ప్రగతి, నాయకులు మడుపల్లి భాస్కర్, మంకెన నాగేశ్వరరావు, మేడ నర్సయ్య కాంగ్రెస్, సిపిఐ కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిపిఐ సభ్యులు పుల్లయ్య మృతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఖమ్మం నగరంలోని 15వ డివిజన్ కొత్తగూడెం సిపిఐ శాఖ సభ్యులు గంధం పుల్లయ్య (68) మృతిచెందారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందారు. మృతునికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతి వార్త తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పగడాల మల్లేష్ తో పాటు పలువురు నాయకులు సోమవారం పుల్లయ్య భౌతికాయాన్ని సందర్శించి పార్టీ జెండా కప్పి పూలమాలలతో ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ సిపిఐ పార్టీ అభివృద్ధి కోసం పుల్లయ్య నిరంతరం కృషి చేశారని ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు. సిపిఐ నిర్వహించిన పలు పోరాటాల్లో ఆయన చురుగ్గా పాల్గొన్నారన్నారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. 15వ డివిజన్ కార్యదర్శి జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, కొత్తగూడెం శాఖ కార్యదర్శి రావుల హన్మంతరావు, కొత్తగూడెం మత్స్యసహకార సంఘం అధ్యక్షులు ముద్రబోయిన అప్పారావు, నాయకులు ప్రసాద్, కర్రి హుస్సేన్, కర్రీ కృష్ణ, చలపతి, కర్రీ వెంకటేశ్వర్లు తదితరులు పుల్లయ్య భౌతికాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# అభివృద్ధి కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించండి





**ప్రజాపక్షం/ రఘునాథపాలెం :** గ్రామాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థులను గెలిపించాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ తెలిపారు. సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండల పరిధిలోని వి. వెంకటాయపాలెం గ్రామంలో జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసి ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిందన్నారు. రెండేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని చూసి ఓటేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, సర్పంచ్ అభ్యర్థి కాపా ఆదినారాయణ, కిలారు వెంకటరమణ, కిలారు అనిల్, పలువురు నాయకులు, వార్డు అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా రాంక్యాతండా, పుఠానితండా గ్రామాల్లో కాంగ్రెస్ తరుపున పోటీ చేస్తున్న అభ్యర్థుల విజయాన్ని కాంక్షిస్తూ కాంగ్రెస్ జిల్లా యూత్ నాయకులు తుమ్మల యుగంధర్ ప్రచారం నిర్వహించారు. సుస్థిర పాలన కోసం కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. గ్రామాల్లో అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందించడమే కాంగ్రెస్ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

**-డిఆర్‌సి వద్ద ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు**
**-రిటర్నింగ్ అధికారులు విధులు పకడ్బందీగా నిర్వహించాలి**
**-టెలికాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఎన్నికల నియామవాళిని ఖచ్చితంగా పాటిస్తూ స్వేచ్ఛ, న్యాయబద్ధ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తెలిపారు. మొదటి విడత పంచాయతీ ఎన్నికల నిర్వహణపై అధికారులతో సోమవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 11, 14, 17న మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికలు జరుగుతాయని, రాబోయే ఎనిమిది రోజులు ముందస్తు ప్రణాళికలతో సజావుగా ఎన్నికలను నిర్వహించాలన్నారు. రిటర్నింగ్ అధికారులు సంబంధిత మండలాల్లో రిపోర్ట్ చేయని పక్షంలో కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు రిటర్నింగ్ అధికారులు సకాలంలో హాజరు కావాలన్నారు. ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ బృందాలను ఏర్పాటు చేశామని, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల వద్దకు సకాలంలో పోలింగ్ బృందాలు చేరుకోవడంతో పాటు సంబంధిత ఆర్‌వోకు రిపోర్టు చేయాలన్నారు. రిజర్వు పోలింగ్ బృందాలు తప్పనిసరిగా విధులకు హాజరయ్యేలా చూడాలన్నారు. డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలు ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్లు పెద్ద వాహనాలు వెళ్లేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలన్నారు. పార్కింగ్‌కు అవసరమైన స్థలాన్ని ఏర్పాటు చేయాలన్నారు. 174 పోలింగ్ లోకేషన్లలో 992 పోలింగ్ కేంద్రాల వద్ద సిసి కెమెరాలు, వెబ్ కాస్టింగ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ర్యాంపు, విద్యుత్ సరఫరా, మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని, చిన్న చిన్న మరమ్మతులు ఉంటే వెంటనే చేయించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అవసరమైన వాహనాలను సిద్ధం చేశామన్నారు. పంచాయతీ ఎన్నికల్లో ఉల్లంఘనలు జరగకుండా ఎఫ్ఎస్‌టి, ఎస్ఎస్‌టి బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన మేర బడ్జెట్ మొదటి దశ ఎంపిడివోలకు విడుదల చేశామన్నారు. ఎన్నికల సిబ్బంది, టిఏ, డిఏ, భోజన ఖర్చులకు నిధులు విడుదల చేశామని ఎక్కడ కూడా సిబ్బంది నుంచి ఫిర్యాదు రావడానికి వీలు లేదని ఎన్నికల సిబ్బందికి నాణ్యమైన ఆహారం అందేలా చూడాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా॥ పి. శ్రీజ, ఎన్నికల నోడల్ అధికారులు, రిటర్నింగ్ అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

# బరిలో 105 సర్పంచ్, 745 వార్డు సభ్యులు

**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** తిరుమలాయపాలెం మండలంలో మొత్తం 40 గ్రామపంచాయతీల పరిధిలో వివిధ పార్టీల నుంచి 222మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయగా వార్డు సభ్యులు 891 మంది నామినేషన్ దాఖలు చేశారు. ఆదివారం సాయంత్రం మూడు గంటలకు ఉపసంహరణకు తుది గడువు అధికారులు నిర్ణయిచంగా మూడు గంటల వరకు మొత్తం మండల వ్యాప్తంగా సర్పంచ్ అభ్యర్థులు విరమించుకోగా 105 సర్పంచ్ అభ్యర్థులు, వార్డు సభ్యులు 745 మంది బరిలో ఉన్నట్లు ఎంపిడిఓ ఎస్కే సిలార్‌సాహెబ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని వార్డులు కలిపి 891 మంది వార్డు సభ్యులు నామినేషన్ దాఖలు చేయగా 146మంది వార్డు సభ్యులు ఉపసంహరించుకోగా 745మంది వార్డు సభ్యులు బరిలో ఉన్నట్లు తెలిపారు. అత్యధికంగా బీరోలు గ్రామంలో 7గురు సర్పంచ్ అభ్యర్థులు పోటీ చేస్తున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా 365 వార్డులకు గాను 365 పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, ఎన్నికలు సజావుగా జరిగేందుకు పకడ్బందీగా ఎలాంటి పొరపాటు లేకుండా ఏర్పాట్లు చేశామని ఆయన తెలిపారు. అత్యధికంగా బీరోలు గ్రామ పంచాయతీలో 7గురు సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఆయన వివరించారు.

# ముజ్జుగూడెంలో కాంగ్రెస్ అభ్యర్థి ఇంటిపై దాడి..!

**మంత్రి పొంగులేటి ఇలాకాలో బిఆర్ఎస్ దౌర్జన్యం**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పంచాయతీ ఎన్నికలలో విజయం సాధించేందుకు బీఆర్ఎస్ కవ్వింపు చర్యలకు పాల్పడుతుంది. ఏకంగా కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి ఇంటి పై దాడి చేసి..హత్యాయత్నం కు పాల్పడ్డారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి సొంత నియోజకవర్గంలో బీఆర్ఎస్ నాయకులు దౌర్జన్యం కు పాల్పడ్డారు. దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఓటర్లు..ప్రజలు టెన్షన్... టెన్షన్ తో గడుపుతున్నారు. రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సొంత నియోజకవర్గంలోని నేలకొండపల్లి మండలం లో ముజ్జుగూడెంలో బీఆర్ఎస్ నాయకులు దౌర్జన్యం కు పాల్పడ్డారు. పంచాయతీ సర్పంచ్ ఎస్సీ మహిళ కు రిజర్వేషన్ చేశారు. కాంగ్రెస్ తరుపున బొడ్డు రేణుక బరిలో నిలిచారు. నామినేషన్ వేసిన రోజు నుంచి స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఘర్షణ వాతావరణం ను సృష్టిస్తున్నారు. అభ్యర్థి ఇంటి వద్ద కు వెళ్లి...లైట్లు బంద్ చేయటం....ఈలలు వేస్తూ, కేరింతలు కొడుతూ, కవ్వింపు చర్యలకు పాల్పడుతున్నారు. ఈ విషయం పై గత రెండు రోజుల క్రితం స్థానిక కాంగ్రెస్ నాయకులు నేలకొండపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు కూడ చేశారు. కానీ పట్టించుకోకపోవటంతో బీఆర్ఎస్ నాయకులు దౌర్జన్యం మరింత పెరిగింది. సోమవారం తెల్లవారు జామున అభ్యర్థి ఇంటి పై బీఆర్ఎస్ నాయకులు దాడి చేశారు. ఇంటి పై రాళ్ల వర్షం కురిపించారు. హత్య చేసేందుకు కర్రలు చేత పట్టుకుని వచ్చి హల్చల్ చేశారు. భయంతో అభ్యర్థి కుటుంబం ఇంట్లో తలుపులు తీయకుండా భయంతో బిక్కుబిక్కుమంటూ గడిపారు. గ్రామంలో విషయం తెలుసుకుని పెద్ద ఎత్తున అభ్యర్థి ఇంటికి చేరుకున్నారు. దీంతో ముజ్జుగూడెం లో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. సమస్యాత్మక గ్రామంగా ఉన్న ముజ్జుగూడెం లో మళ్లీ గతం పునారావృతం అవుతుందా అనే విధంగా చర్చించుకుంటున్నారు. మొత్తం ప్రజలు, ఓటర్లు టెన్షన్...టెన్షన్ గా ఉన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి రేణుక ఇంటి పై దాడి హత్యయత్నాం పై స్థానిక పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు పోలీసులు డాగ్ స్క్వాడ్ తో విస్తృతంగా తనిఖీ లు చేశారు. పోలీసులు క్షేత్ర స్థాయి విచారణ చేపట్టారు. భాదితురాలి ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా బాధితురాలుమాట్లాడారు. నామినేషన్ వేసిన రోజు నుంచి గొడవలకు కాలు దువ్వుతున్నారని ఆరోపించారు. తాము తలుపు తెరిచి ఉంటే కుటుంబం మొత్తం ను చంపేందుకు కర్రలు, రాళ్లు పట్టుకుని వచ్చారని అన్నారు. ఎన్నికలలో పోటీ చేయటం నేరమా అని ప్రశ్నించారు. తమ కుటులబం దాడికి యత్నించిన వారి పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇది ఇలా ఉండగా దళిత మహిళ అభ్యర్థి ఇంటి పై దాడికి యత్నంచటం పట్ల పలువురు నాయకులు, దళిత సంఘాలు తీవ్రంగా ఖండించాయి.

# మద్యం తాగి గొడవలు సృష్టిస్తే చర్యలు

**-నేటి సాయంత్రం నుండి 144 సెక్షన్ అమలు**
**-వైరా ఎస్సై పుష్పాల రామారావు**



**ప్రజాపక్షం/వైరా:** మద్యం తాగి గొడవలు సృష్టిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని వైరా ఎస్సై పుష్పాల రామారావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపద్యంలో మద్యం సేవించి ఇతరులకు సిబ్బంది కలిగించడం కాని గొడవలు పెట్టడం గాని చేయవద్దని ఆయన సూచించారు. మంగళవారం సాయంత్రం నుండి ఈ నెల11న సాయంత్రం వరకు వైరా మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందని, ఎవరు నిబంధనలో అతిక్రమించవద్దని సూచించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుపుకోవాలని అలాకాకుండా మద్యం మత్తులో గొడవలకు కారణమైతే అలాంటి వారిపై చట్టపరంగా కేసులు నమోదు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అదేవిధంగా 144 సెక్షన్ నిబంధనలను అతిక్రమించిన చర్యలు తప్పవు అన్నారు. మత్తుకు బానిసకావడం మీ జీవితానికి ప్రమాదం అని మత్తు అనేది మీ ఆరోగ్యంతో పాటు మీ జీవితాన్ని కూడా పూర్తిగా పాడుచేస్తుందని మీకున్న బంధాలను కూడా దూరం చస్తుందని తెలిపారు. ఎప్పటికప్పుడు పోలీసులు నీకు ఉంటుందని ఎక్కడైనా మద్యం తాగి పట్టుబడ్డ కేసు నమోదు చేస్తామన్నారు. అదేవిధంగా విధులకు ఆటంకం కలిగించిన చర్యలు తప్పవని ఎస్సై రామారావు తెలిపారు.

# ఎలివేటెడ్ షెడ్ల ద్వారా అంటు రోగాలు నివారణ

**- కలెక్టర్ జితేష్ వి పాటిల్**



**ప్రజాపక్షం/చండ్రుగొండ :** ఎలివేటెడ్ షడ్ల ద్వారా జీవాల్లో అంటురోగాలు నివారించవచ్చని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. సోమవారం చండ్రుగొండ మండలంలోని మద్దుకూరు రైతు తలారి రవి ఏర్పాటు చేసిన ఎలివేటెడ్ మేకల,గొర్రెల షెడ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్ విధానం పశుసంవర్ధక రంగంలో ఆధునిక శాస్త్రీయ పద్దతి అని, ఈ విధానం ద్వారా జీవుల్లో అంటు వ్యాధులు గణనీయంగా తగ్గుతాయని అన్నారు. ముఖ్యంగా చిన్న పిల్లల మరణాల శాతం ఈ విధానంతో సృష్టంగా తగ్గడం శుభ పరిణామమని అన్నారు. ఫోరింగ్ కారణంగా పేడ, మూత్రం నేలపై నేరుగా పడిపోవడం ద్వారా ఫ్లోర్ ఎప్పటికప్పుడు పొడి, పరిశుభ్రంగా ఉంటుందని, దీని వల్ల తడి లేకుండా శుభ్రమైన తావావరణం ఏర్పడి అంటు వ్యాధుల నివారణ జరుగుతుందన్నారు. రైతు రవి స్వయంగా గడ్డి కోసేయంత్రం ఫర్నీచర్ యూనిట ఫీడ్ మిక్చర్ వంటి వినూత్న ఆవిష్కరణలను కలెక్టర్ పరిశీలించి అభినందించారు. గ్రామీణ స్థాయిలో రైతులు ఇలాంటి సృజనాత్మక తను ప్రదర్శించడం పశు సంవర్ధక రంగ అభివృద్ధికి దోహదపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డా. వెంకటేశ్వర్లు, మండల పశు సంవర్ధక అధికారి డా. వి సంతోష్, రెవెన్యూ అధికారి సంధ్యారాణి, రైతు తలారి రవి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

# ప్రశాంత వాతావరణంలో ఎన్నికలకు సహకరించండి



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** గ్రామ పంచాయితీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఇల్లందు డిఎస్‌పి ఎన్ చంద్రభాను తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సర్పంచ్ అభ్యర్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందుకు పోటీ చేసే అభ్యర్థులే బాధ్యత తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఎన్నికల నిబంధనలకు లోబడి, అధికారులు పోలీసు వ్యవస్థ పని చేస్తుందని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో పోలీస్ శాఖ సమావేశాలు ఏర్పాటు చేసిందని, ఎన్నికల్లో ఓటమి గెలుపులు సహజం..ఒక సారి ఓడిన వ్యక్తి మరోసారి గెలిచిన సందర్భాలు చాలా ఉన్నాయి. గెలిచిన వ్యక్తి మళ్ళీ ఓడిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. వీటిని పరిగణలోకి తీసుకొని మెసులుకోవాలన్నారు. అనంతరం సిఐ బత్తుల సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో బైండోవర్ కేసులు జరిగాయని, కావాలని గొడవలు సృష్టించిన ప్రేరేపించిన సహించేది లేదని, ఎన్నికలు ప్రతి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. పోటీ అనేది కేవలం ఎన్నికలే..గెలుపు ఓటములు సహజమని, ఘర్షణలకు గొడవలకు తావ్వికుండా ఎన్నికలకు సహకరించాలని కోరారు. పోలింగ్ బూతుల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ, సిబ్బంది, మండలంలోని ఎన్నికల్లో పోటీ చేస్తున్న గ్రామ పంచాయితీ సర్పంచుల అభ్యర్థులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళిని పాటించాలి

**-ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి**



**ప్రజాపక్షం/కూసుమంచి:** వచ్చే గ్రామ పంచాయితీ ఎన్నికల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరు సహకరించాలని రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి కోరారు. సోమవారం కూసుమంచి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సర్పంచ్ అభ్యర్థుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇందుకు పోటీ చేసే అభ్యర్థులే బాధ్యత తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఎన్నికల నిబంధనలకు లోబడి, అధికారులు పోలీసు వ్యవస్థ పని చేస్తుందని స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో పోలీస్ శాఖ సమావేశాలు ఏర్పాటు చేసిందని, ఎన్నికల్లో ఓటమి గెలుపులు సహజం..ఒక సారి ఓడిన వ్యక్తి మరోసారి గెలిచిన సందర్భాలు చాలా ఉన్నాయి. గెలిచిన వ్యక్తి మళ్ళీ ఓడిపోయిన సందర్భాలు కూడా ఉన్నాయి. వీటిని పరిగణలోకి తీసుకొని మెసులుకోవాలన్నారు. అనంతరం సిఐ సంజీవ్‌కుమార్ మాట్లాడుతూ ఇప్పటికే గ్రామాల్లో బైండోవర్ కేసులు జరిగాయని, కావాలని గొడవలు సృష్టించిన ప్రేరేపించిన సహించేది లేదని, ఎన్నికలు ప్రతి గ్రామాభివృద్ధికి తోడ్పడాలని కోరారు. అదే విధంగా ఎంపీడీవో జస్వంత్ కుమార్ మాట్లాడుతూ పోటీ అనేది కేవలం ఎన్నికలే..గెలుపు ఓటములు సహజమని, ఘర్షణలకు గొడవలకు తావ్వికుండా ఎన్నికలకు సహకరించాలని కోరారు. పోలింగ్ బూతుల వద్ద అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా సౌకర్యాలు కల్పిస్తున్నామని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది, మండలంలోని ఎన్నికల్లో పోటీ చేస్తున్న గ్రామ పంచాయితీ సర్పంచుల అభ్యర్థులు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# గుండాల మండలంలో ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీ



**ప్రజాపక్షం/గుండాల :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గుండాల మండల పరిదిలోని దేవళ్లగూడెం గ్రామంలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృదం అధికారులు సోమవారం వాహనాలు తనిఖీ చేశారు . ఎన్నికల నియమావళికి విరుద్ధంగా పరిమితికి మించినగదు, మద్యంలాం టివి తరలిస్తున్నట్లు అనుమానంతో ప్రతి ఒక్క వాహనాన్ని నిలిపి క్షున్నంగా తనిఖి చేశారు. తణిఖి బృదం అధికారులు క్రిష్ణమాచారి,బాలస్వామి,వెంకటేశ్వర్లు ఎఎస్సై, రమేష్ కానిస్టేబుల్ ఉన్నారు.

# మేజర్ పంచాయతీ అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తా

**-మేజర్ పంచాయతీ కాంగ్రెస్ అభ్యర్థి పసుపులేటి శ్రీలత**



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** నేలకొండపల్లి మేజర్ గ్రామపంచాయతీ అభివృద్ధి కోసం నిరంతరం పని చేస్తానని కాంగ్రెస్ అభ్యర్థి పసుపులేటి శ్రీలత అన్నారు. మేజర్ పంచాయతీలో సోమవారం ఇంటింటా విస్రుతంగా ప్రచారం నిర్వహించారు. నేలకొండపల్లి మేజర్ పంచాయతీని రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సహాకారంతో పంచాయతీ ని అభివృద్ధి చేస్తానని అన్నారు. నేలకొండపల్లి పంచాయతీ ని అన్ని రకాలు గా అభివృద్ధి చేసి రుణం తీర్చుకుంటానని అన్నారు. స్థానిక ఆడబిడ్డ గా నేలకొండపల్లి లో ప్రజలు ఎదుర్కుంటున్న పలు సమస్యల ను దశల వారీగా పరిష్కరిస్తానని పేర్కొన్నారు. తన గెలుపు కోసం అహర్నిషలు శ్రమిస్తున్న కాంగ్రెస్, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో రాయపూడి నవీన్, జెర్రిపోతుల అంజిని, వంగవీటి నాగేశ్వరరావు, బొడ్డు బొందయ్య, యం.వెంకన్న, జెర్రిపోతుల సత్యనారాయణ, మైశా శంకర్, కడియాల నరేష్, మద్దినేని మహేష్, పావులూరి వెంకటేశ్వర్లు, అక్కినేని నాగేశ్వరరావు, గుడిపాటి ముక్కంటి తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు సహకరించండి



**ప్రజాపక్షం/ఇల్లందు:** రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు అత్యంత ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని డిఎస్‌పి చంద్రభాను, సిఐ బత్తుల సత్యనారాయణ, బోడు ఎస్ఐ పి శ్రీనివాస్‌రెడ్డి కోరారు. ఎన్నికల కోడ్, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా సోమవారం సంపత్‌నగర్‌లో తన సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. ఈసందర్భంగా అక్కడ ఉన్న వివిధ పార్టీల నాయకులు, ముఖ్య కార్యకర్తలతో వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా, ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిగేలా చూడాలన్నారు. గ్రామీణ స్థాయి నుండి మండల స్థాయి వరకు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. పోలీసుల సూచనలు పాటిస్తూ, ఎన్నికల నియమావళికి కట్టుబడి ఉండాలని, ప్రజలకు ఇబ్బంది కలగకుండా ప్రచారం నిర్వహించుకోవాలని సూచించారు. సమస్యాత్మక అంశాలపై పోలీసులు నిఘా ఉంచారని, అందరూ భాధ్యతయుతంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, పలు పార్టీల స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# దివ్యాంగ ఉపాధ్యాయుడు లక్ష్మకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



**ప్రజాపక్షం/ఇల్లందు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్ విద్యాచందన, జిల్లా వయో వృద్ధుల వికలాంగులు అభివృద్ధి అధికారి స్వర్ణలతా లెనినా, జిల్లా విద్యాశాఖ అధికారి నాగలక్ష్మి చేతుల మీదుగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశానుసారంగా సోమవారం టేమవారం మండలంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల యందు పని చేస్తున్న దివ్యాంగ ఉపాధ్యాయుడు బానోత్ లక్ష్మాకు సన్మానం చేసి అవార్డు అందించారు. అనంతరం బానోత్ లక్ష్మా మాట్లాడుతూ జిల్లా స్థాయిలో రెండవ సారి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు కలెక్టర్ కార్యాలయం నందు అందుకోవడం ఎంతో గర్వకారణంగా ఉందని, ఇంత పెద్ద ఎత్తున సన్మానించి సత్కరించిన జిల్లా అధికారులకు పేరు పేరునా ధన్యవాదాలు తెలియజేస్తున్నానని, రెండవ సారి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం మరింత బాధ్యత పెంచిందని, ఇంకా ఎంతో ఉత్సాహంగా పని చేస్తానని తెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా భవిత కోఆర్డినేటర్ అధికారి సైదులు, మెప్మ జిల్లా అధికారి, వికలాంగ ఉద్యోగ ఉపాధ్యాయులు, అన్ని డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అభ్యర్థికి సిపిఐ మద్దతు



**ప్రజాపక్షం/గుండాల :** గుండాల మేజర్ పంచాయితీ కాంగ్రెస్‌పార్టీ సర్పంచ్ అభ్యరిగా బరిలో ఉన్న బీకోజి (అజెయ్) కి సిపిఐ పార్టీ తమ పూర్తి స్థాయి మద్దతును తెలుపుతున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి వాగబోయిన రమేష్ విలేకర్ల సమావేశంలో వెల్లడించినట్లు ప్రకటించారు. బీకోజి గెలుపు కోసం వక్తి వంచన లేకుండా కృషిచేయనున్నట్లు తెలిపారు. సిపిఐ పార్టీ శ్రేనులు పార్టీ నిర్ణయానికి కట్టుబడి అభ్యర్థి గెలుపుకోసం కృషిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బచ్చలి రామయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్కే ఖదీర్, అశోక్ , కాశీం, నబి, ముత్తయ్యతదితరులు పాల్గొన్నరు

# ఎన్నికలకు సర్వం సిద్ధం

**ప్రజాపక్షం/ దుమ్ముగూడెం:** ఈనెల11న జరిగే స్థానిక ఎన్నికల్లో అభ్యర్థులు ఎన్నికల నియమావళిని ఉల్లంగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎన్నికల నోడల్ అధికారి తహాశీల్దార్ మామిడి అశోక్ తెలిపారు. సోమవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలో 324 వార్డులకు పోలింగ్ కేంద్రాలను ఎన్నికలకు సిద్ధం చేసామన్నారు. ఎన్నికల సమయంలో ఎన్నికల నియమాలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.అటువంటి సంఘటలను ఏమన్న ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని కోరారు.మండలంలో జరిగే ఈ ఎన్నికలు 5 జోన్లు ,13రూట్లు, ఏడు గ్రామ పంచాయితీలకు ఒక జోను గా విభజించారు. ఈఎన్నికల్లోమండలంలో 35 గ్రామ పంచాయితీలుకు గాను 110 సర్పంచ్ అభ్యర్థులు ,324మంది వార్డు సభ్యులు పోటీలో ఉండగా ఇప్పటికే ఐదు గ్రామ పంచాయితీలు ఏకగ్రీవంగా కావడంలో ఐదుగురు సర్పంచ్‌లు , 142మంది వార్డు సభ్యులు ఏకగ్రీవం కాగ మిగిలిన 30 గ్రామ పంచాయితీల్లో 105మంది సర్పంచ్ అభ్యర్థులు , 182 మంది వార్డు సభ్యులు ఎన్నికల పోటీలో ఉన్నట్లు ఆయన తెలిపారు.

# బెస్ట్ ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకున్న చందు




**ప్రజాపక్షం/వైరా:** వైరాకి చెందిన ఫొటోగ్రాఫర్ చందు బెస్ట్ ఫొటోగ్రాఫర్ అవార్డు అందుకున్నాడు. తెలుగు ఆర్ట్ ఫొటోగ్రాఫి, వివిధ ఫొటోగ్రాఫి సొసైటీ వారు నిర్వహించిన తెలంగాణ ఫొటోగ్రాఫి అకాడమీ అనుబంధంతో 6,7 తేదీల్లో ఉమ్మడి నిజామాబాద్ జిల్లా గాంధారిలో జరిగిన జాతీయస్థాయి ఫొటోగ్రాఫి వర్క్‌షాపులో టిపిఎస్ సిల్వర్ అవార్డు మండలంలోని ఫొటోగ్రాఫర్ తేళ్ళపుట్ట చందు సాధించాడు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ గాంధారి ఫొటోగ్రాఫి వర్క్‌షాపు లక్ష్యంగా చేసుకొని తన 10వ ఏటే అడుగుపెట్టి అంచెలంచెలుగా ఎదుగుతూ నేటికి కొన్ని వేల శుభకార్యాలను తన కెమెరాతో బంధించి అందరి మన్ననలను అందించినందుకు ఆనందంగా ఉందన్నారు. అనంతరం మొదటి బహుమతి రావడం పట్ల మండలం ఫొటోగ్రాఫర్లు అభినందించారు. ఈ కార్యక్రమంలో కుమారస్వామి రామకృష్ణ, ఫొటోగ్రాఫి మిత్రులు, పలువురు పాల్గొన్నారు.

# సిపిఐ విజయ పరంపరను కొనసాగించండి

## ఆవుల నర్సింహారావును భారీ మెజార్టీతో గెలపించండి
## సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని



**ప్రజాపక్షం/చింతకాని :** బస్వాపురం గ్రామపంచాయతీలో సిపిఐ విజయ పరంపరను కొనసాగించి ఆవుల నర్సింహారావు ను భారీ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు బస్వాపురం ఓటర్లను కోరారు. సిపిఐ సర్పంచ్ అభ్యర్థి ఆవుల నర్సింహారావు విజయాన్ని కాంక్షిస్తూ సోమవారం బస్వాపురం గ్రామంలో కూనంనేని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ బస్వాపురంలో గత రెండు దశాబ్దాలుగా సిపిఐ పార్టీ గెలుస్తుందని తిరిగి నర్సింహారావును గెలిపించి సిపిఐ వందేళ్ల వేడుకకు కానుకగా ఇవ్వాలని కోరారు. బస్వాపురంలో ప్రతి ఎన్నికల్లో సిపిఐ అభ్యర్థులను ఆదర్శిస్తున్నారని అభివృద్ధే ధ్యేయంగా గత ఇరవై ఏళ్లుగా సిపిఐ సర్పంచ్‌లు ఆవుల సైదులు, ఆవుల నర్సింహారావు, బొడ్డు సుగుణమ్మ, రాసాల సాంబలక్ష్మి బస్వాపురం అభివృద్ధిలో తమదైన ముద్ర వేశారని, యువకుడు , స్నేహశీలి నర్సింహారావు ను అత్యధిక మెజార్టీతో గెలిపించి తిరిగి బస్వాపురం అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు మాట్లాడుతూ ఎన్నికలప్పుడు వచ్చే పగటి వేషగాళ్లను నమ్మవద్దని అభివృద్ధికోసం , ప్రజా సమస్యల కోసం కృషి చేసే నర్సింహారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు తటి వెంకటేశ్వర్లు, పావులూరి మల్లిఖార్జునరావు, పగడాల మల్లేష్, జిల్లా సమితి సభ్యులు రాసాల మోహన్‌రావు, , మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి మార్గం శ్రీను, మాజీ ఎంపీపీ కన్నెబోయిన విజయమ్మ, మాజీ సర్పంచ్‌లు బొడ్డు సుగుణమ్మ కొండలరావు, రాసాల సాంబలక్ష్మి, శాఖ కార్యదర్శి బద్దల నర్సింహారావు, మామిడాల యాలాద్రి, ఉయ్యాల బోడయ్య, పొట్టపల్లి కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

### జగన్నాధపురం అభివృద్ధి స్వప్న తోనే సాధ్యం : మల్లు నందిని



జగన్నాధపురం అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తాళ్లూరి స్వప్న తోనే సాధ్యం అని డిప్యూటీ సీఎం సతీమణి మల్లు నందిని పేర్కొన్నారు. సోమవారం చింతకాని మండలం జగన్నాధపురం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తాళ్లూరి స్వప్న విజయాన్ని కాంక్షిస్తూ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు , నాయకులు బందెల నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# రాఘవాపురంను దేశంలో ఆదర్శంగా తీర్చిదిద్దాలి

## కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని



**ప్రజాపక్షం/చింతకాని :** రాఘవాపురం గ్రామపంచాయతీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సూచించారు. రాష్ట్రంలోనే సిపిఐ ఏకగ్రీవంగా మొదటగా గెలిచిన రాఘవాపురం పంచాయతీ పాలకవర్గాన్ని సోమవారం కూనంనేని అభినంధించారు. రాఘవాపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో కూనంనేని మట్లాడుతూ రాఘవాపురం సిపిఐ కంచుకోట అని , గతంలో కూడా నూతన పంచాయతీగా ఏర్పడ్డప్పుడు రాష్ట్ర సమితి సభ్యులు కనపర్తి గోవాందరావును ఏకగ్రీవంగా ఎన్నుకుని ఆదర్శంగా నిలిచారని తిరగి రెండవ ఎన్నికల్లో కూడా సర్పంచ్‌గా కాంపల్లి కోటమ్మ తో పాటు ఎనిమిది వార్డులను ఏకగ్రీవంగా సిపిఐ పార్టీని ఎన్నుకోవడం చాలా అభినంధనీయమన్నారు. నూతన పాలక వర్గం గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ ప్రజల మన్ననలు పొందాలన్నారు. అనంతరం నూతన పాలకవర్గాన్ని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు, ఏనుగు వెంకటేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, కూచిపుడి రవి, నాయకులు కొల్లి సీతయ్య, సింగారపు సత్యనారాయణ, శాఖ కార్యదర్శి కొల్లి రవికుమార్, ఉపసర్పంచ్ అబ్బూరి మహేష్, వార్డు సభ్యులు , కాంగ్రెస్ నాయకులు పెంట్యాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో తొలి ఏకగ్రీవం

రామ గోవిందాపురం సర్పంచ్‌గా మందపాటి మౌనికారెడ్డి



**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సత్తుపల్లి మండలంలో తొలి ఏకగ్రీవం జరిగింది. రామగోవిందపురం పంచాయతీ సర్పంచ్ గా మందపాటి మౌనికారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ గ్రామంలో కాంగ్రెస్ నుంచి రెబల్ గా వేసిన వ్యక్తితో పాటు బీఆర్ఎస్ అభ్యర్థులు కూడా ఉపసంహరించుకోవడంతో కాంగ్రెస్ అభ్యర్థి మౌనికా రెడ్డి సర్పంచ్ గా బాధ్యతలు స్వీకరించనున్నారు. ఏకగ్రీవం కావడం కోసం కృషి జరిపిన శాసన సభ్యులు డా. మట్టా రాగమయి దయానంద్ దంపతులతో సహా మండల కాంగ్రెస్ అధ్యక్షులు శివా వేణు, సీనియర్ నాయకులు చల్లగుళ్ళ నర్సింహారావు, దాసరి మదుమోహన్ రెడ్డి తదితరులకు ఈ సందర్భంగా మౌనిక రెడ్డి దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.

# అక్రమాలను అరికట్టాలి

## - చెక్‌పోస్టును పరిశీలించిన ఎస్‌పి



**ప్రజాపక్షం/భద్రాచలం :** గ్రామ పంచాయితీ ఎన్నికల సందర్భంగా అక్రమ మధ్యం నగదు రవాణాను సమర్థవంతంగా అరికట్టాలని ఎస్‌పి రోహిత్ రాజ్ అన్నారు. సోమవారం భద్రాచలం బ్రిడ్జీ పాయింట్ వద్ద ఏర్పాటు చేసిన ఎస్ఎస్‌టి చెక్ పోస్టును భద్రాచలం ఏఎస్‌పి విక్రాంత్ కుమార్ సింగ్‌తో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ వాహనాని నిషితంగా పరిశీలించాలని ఆదేశించారు. ఓటర్లను ప్రలోబాలకు గురిచేసేందుకు పలు అక్రమ మార్గాలను ఎంచుకుని మద్యం నగదు పంపిణీ చేసేందుకు పెద్ద ఎత్తున రవాణా అయ్యే అవకాశం ఉందని, దీనిపై దృష్టి సారించాలన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును నిర్భయంగా ఉపయోగించుకునేలా పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ ఆగరాజు, ఎస్సై సతీష్, తదితరులు పాల్గొన్నారు.

## పోటీ నుండి తప్పకోండి.. లేదంటే వేటు తప్పదు

**ప్రజాపక్షం/పెనుబల్లి:** త్వరలో ఈ నెల 17 న జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి రెబల్స్ బెడద తలనొప్పిగా మారింది. దీంతో పార్టీ ఆదేశాల ప్రకారం రెబల్స్ పైన చర్యలకు పావులు కదుపుతుంది. మండల కాంగ్రెస్ అధ్యక్షులు పంది వెంకటేశ్వరరావు రెబల్స్ పైన చర్యలు కోసం నివేదికలు పంపినట్లు ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు సమయం ఇచ్చినా పార్టీ ఆదేశాలు దిక్కరించి పార్టీకి వ్యతిరేకంగా ఎన్నికల్లో పోటీ చేసున్నందున సస్పెండ్, బహిష్కరణ చేసేందుకు జిల్లా పార్టీ, రాష్ట్ర పార్టీకి తగు చర్యలకోసం నివేదిక పంపినట్లు వెంకటేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు.

# సిపిఐ అభ్యర్థిని మందడపు రాణిని గెలిపించండి : కూనంనేని



**ప్రజాపక్షం/మధిర రూరల్ :** మండల పరిధిలోని మల్లారం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సిపిఐ అభ్యర్థిని మందడపు రాణిని అఖండ మెజార్టీతో గెలిపించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రజలను అభ్యర్థించారు. సోమవారం గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మల్లారం గ్రామంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, ఇతర జిల్లా నేతలతో కలిసి ప్రచారంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటి ప్రచారంలో పాల్గొని మందడపు రాణిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం కూనంనేని మాట్లాడుతూ గతంలో మల్లారం ఎంపిటిసిగా గ్రామాభివృద్ధికి విశేష కృషి చేసిన సిపిఐ జిల్లా నాయకులు అమరజీవి కామ్రేడ్ మందడపు నాగేశ్వరరావు చేసిన సేవలను గుర్తు చేశారు. కాంగ్రెస్ బలపర్చిన సిపిఐ అభ్యర్థిని మందడపు రాణిని గెలిపిస్తేనే గ్రామం అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుందని అన్నారు. మల్లారం గ్రామాభివృద్ధి కోసం భర్త అడుగుజాడల్లో నడుస్తూ సర్పంచ్‌గా పోటీచేస్తున్న మందడపు రాణి గెలుపుతోనే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబు, సిపిఐ మధిర మండల కార్యదర్శి ఊట్ల కొండలరావు, బోనకల్ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, సిపిఐ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# మద్యం దుకాణాలు బంద్ : సిపి సునిల్‌దత్



**ప్రజాపక్షం/ఖమ్మం క్రైం :** మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికలు ఈనెల 11వ తేదీన జరుగనున్న నేపథ్యంలో కమిషనరేట్ పరిధిలోని రఘునాధపాలెం, కొణిజర్ల, వైరా, చింతకాని, బోనకల్లు, మధిర, ఎర్రుపాలెం మండలాల్లో నేటి సాయంత్రం గం.5.30 నుంచి 11న ఎన్నికలు, ఓట్ల లెక్కింపు, ఫలితాలు వెలువడే వరకూ మద్యం దుకాణాలు బంద్ చేయాలని పోలీసు కమిషనర్ సునిల్‌దత్ సోమవారం ఒక ప్రకటనలో సదరు దుకాణాల యజమానులకు సూచించారు. అదే విధంగా 14వ తేదీన రెండవ విడత ఎన్నికలు జరుగు ఖమ్మం రూరల్, ముదిగొండ, నేలకొండపల్లి, కూసుమంచి, తిరుమలాయపాలెం, కామేపల్లి మండలాల్లో 12వ తేది సాయంత్రం నుంచి ఎన్నికలు, లెక్కింపు, ఫలితాలు వెలువడేవరకూ ఆయా మండలాల్లో మద్యం విక్రయాలు నిలిపివేయాలన్నారు. ఈనెల 17న జరుగనున్న ముడవ విడత ఎన్నికలు జరిగే సింగరేణి, ఏన్కూర్, తల్లాడ, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూర్ మండలాల్లో 15వ తేదీ సాయంత్రం నుంచి ఎన్నికలు, లెక్కింపు, ఫలితాలు విడుదల అయ్యేవరకూ ఆయా మండలాల్లో మద్యం దుకాణాలు, విక్రయాలు నిలిపివేయాలని సిపి పేర్కొన్నారు. ఆయా రోజుల్లో ఆయా మండలాల్లో వైన్‌షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేయాలన్నారు. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు షాపు సిజ్‌చేస్తామని హెచ్చరించారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండ ముందస్తు చర్యలో భాగంగా మద్యం అమ్మకాలను నిలిపివేస్తున్నట్లు సిపి తెలిపారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేందుకు ప్రజలతో పాటు మద్యం వ్యాపారులు పోలీసులకు సహకరించాలన్నారు.

# ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** త్రైమాసిక తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈవిఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి తనిఖీ చేశారు. సోమవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, రాజకీయ ప్రతినిధులతో కలిసి ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేశారు. తొలుత ఈవిఎం గోడౌన్ సీల్‌ను పరిశీలించి రాజకీయ ప్రతినిధులు, అధికారుల సమక్షంలో సీల్ తీసి లోపలికి వెళ్లి ఈవిఎం, వివిప్యాట్లు ఉన్న గది లోపల పరిశీలన చేసి తిరిగి సీల్ వేయించారు. తనిఖీ రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గోడౌన్ లోపలి గోడలపై క్రాక్‌లను చూసి వర్షపు నీటికి చెమ్మ రాకుండా, తడి లేకుండా ఉండేవిధంగా చూడాలని వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈవిఎంల భద్రత ముఖ్యమైందన్నారు. అలారం, ఫైర్‌సెఫ్టీ పరికరాలను పరిశీలించారు. సిసి కెమెరాల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎంఏ రాజు, ఆర్అండ్‌బి డిఈ లకన్ నాయక్, ఏఈ లలిత, ఎన్నికల డిటి అన్సారీ, వివిధ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# గొల్లమందల పాపమ్మకు సిపిఐ నేతల నివాళి



**ప్రజాపక్షం/ బోనకల్ :** రాపల్లి గ్రామ పంచాయతీ పాలక వర్గ మాజీ సభ్యురాలు గొల్లమందల పాపమ్మ (65) మృతిపట్ల సిపిఐ తీవ్ర సంతాపాన్ని ప్రగాఢ సానుభూతిని తెలియజేసింది. పాపమ్మ సోమవారం అనారోగ్యంతో ఆకస్మికంగా మృతిచెందారు. పాపమ్మకు భర్త, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఆమె మృతి వార్త తెలిసిన వెంటనే సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, తోట రామాంజనేయులు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏనుగు గాంధీ తదితరులు పాపమ్మ మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాపమ్మ భర్త సిపిఐలో సుదీర్ఘ కాలం పనిచేశారు. పాపమ్మ కుటుంబానికి సిపిఐ నేతలు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. నివాళులర్పించిన వారిలో కాంగ్రెస్ నాయకులు తోట చలపతిరావు, సర్పంచ్ అభ్యర్థి మోదుగు భూలక్ష్మి, సిపిఐ శాఖ కార్యదర్శి ఏనుగు రామకృష్ణ, ఏనుగు రవికుమార్ లు ఉన్నారు.